సోమవారం
10-06-2024

విజయవాడ ప్రచురణ

సంపుటి : 72, సంచిక : 349
పేజీలు : 8, వెల: రూ.5.00

Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com

స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

హైతీ తాత్కాలిక ప్రధానికి అస్వస్థత

పోర్ట్-ఓ -ప్రిన్స్: హైతీ తాత్కాలిక ప్రధానమంత్రి గ్యారీ కొనిల్ ఆస్పత్రిపాలయ్యారు. శనివారం రాత్రి ఆస్పత్రిలో చేరినట్లు ఆయన కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని పేర్కొంది. అయితే ఆయన ఆస్పత్రిలో చేరడానికి గల కారణాలు వెల్లడించలేదు. వారం రోజుల పాటు తీవ్రమైన పని ఒత్తిడి కారణంగా ఆయన స్వల్ప అస్వస్థతకు గురయ్యారని ఆ ప్రకటనలో తెలిపింది. మే 28న గ్యారీ కొనిల్ హైతీ తాత్కాలిక ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. శ్వాస కోస సమస్యతో ఆస్పత్రిలో చేరినట్లు స్థానిక మీడియా తెలిపింది. యునిసెఫ్ ప్రాంతీయ డైరెక్టర్ పదవికి రాజీనామా చేసిన ఆయన... జూన్ 1న హైతీకి చేరుకున్నారు.

తెలుగు రాష్ట్రాలకు ఐదు మంత్రి పదవులు

ఏపీకి మూడు, తెలంగాణకు రెండు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో తెలుగు రాష్ట్రాలకు ఐదు మంత్రి పదవులు దక్కాయి. ఇందులో ఏపీకి సంబంధించి రెండు టీడీపీ ఖాతాలో పడగా... మరొకటి బీజేపీ ఖాతాలో పడింది. శ్రీకాకుళం ఎంపీ కింజరపు రామ్మోహన్‌నాయుడుకు కేంద్ర కేబినెట్ మంత్రిగాను, సహాయమంత్రులుగా గుంటూరు టీడీపీ ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్, నరసాపురం బీజేపీ ఎంపీ భూపతిరాజు శ్రీనివాస వర్మకు అవకాశం లభించింది. ఎన్డీఏ భాగస్వామ్య పార్టీ అయిన జనసేనకు నిరాశే ఎదురైంది. శ్రీకాకుళం నుంచి రామ్మోహన్‌నాయుడు మూడు సార్లు టీడీపీ నుంచి గెలుపొంది, మంత్రి పదవిని దక్కించుకున్నారు. గుంటూరు టీడీపీ ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్, నరసాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాసవర్మ తొలిసారిగా ఎంపీగా విజయం సాధించినప్పటికీ మంత్రి పదవులు పొందడం విశేషం. భూపతిరాజు 1988లో బీజేపీ కార్యకర్తగా ప్రస్తావనం ప్రారంభించి, పార్టీలో అనేక బాధ్యతల్లో పనిచేశారు. ఇక తెలంగాణ నుంచి ఇద్దరికి చోటు దక్కనుంది. బీజేపీ ఎంపీ కిషన్‌రెడ్డికి కేబినెట్ మంత్రిగా, బండి సంజయ్‌కు సహాయమంత్రిగా అవకాశం లభించింది. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కిషన్‌రెడ్డి, కరీంనగర్ నుంచి బండి సంజయ్ విజయం సాధించిన విజయం సాధించారు.

సీఎం రమేశ్‌కు షాక్

సార్వత్రిక ఎన్నికల్లో ఏపీ నుంచి ఎన్డీఏ కూటమి ఎంపీలు 21 మంది విజయం సాధించారు. వారిలో టీడీపీ 16, బీజేపీ 3, జనసేన 2 ఎంపీలుగా గెలుపొందారు. కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో కీలకంగా మారారు. దీంతో తొలుత ఐదు మంత్రి పదవులు రాష్ట్రానికి కేటాయిస్తారన్న ప్రచారం వచ్చింది. వారిలో టీడీపీ, బీజేపీ, జనసేనకు ప్రాధాన్యత దక్కుతుందని ఆశించారు. కానీ టీడీపీకి కేవలం రెండు మంత్రి పదవులు, బీజేపీకి ఒక్కటితోనే సరిపెట్టారు. కేంద్ర మంత్రి పదవి ఆశించిన అనకాపల్లి బీజేపీ సీఎం రమేశ్‌కు షాక్ తగిలింది. బీజేపీ కోటాలో కేవలం ఒకర్నే తీసుకుని, భూపతిరాజు శ్రీనివాసవర్మకు అధిష్ఠానం అవకాశం ఇచ్చింది. పొత్తులో భాగంగా బీజేపీ అరకు, అనకాపల్లి, రాజమండ్రి, నరసాపురం, తిరుపతి, రాజంపేట ఎంపీ స్థానాల్లో పోటీ చేసింది. ఇందులో అనాకపల్లి, రాజమండ్రి, నరసాపురం స్థానాలను గెలుచుకుంది. గెలిచిన బీజేపీ ఎంపీల్లో సీఎం రమేశ్ కేంద్ర మంత్రి పదవి లభిస్తుందన్న ధీమాతో ఉన్నప్పటికీ నిరాశే ఎదురైంది.

జనసేనకు నిరాశ

ఇక కాకినాడ, మచిలీపట్నం ఎంపీ స్థానాల్లో జనసేన పోటీ చేసి గెలుపొందగా... మచిలీపట్నం ఎంపీ బాలశౌరికి కేంద్రంలో బెర్త్ లభిస్తుందని ఆశించి... భంగపాటుకు గురయ్యారు. జనసేన

- మిగతా 2 లో

మోదీ 3.0

కేంద్రంలో కొలువుదీరిన ఎన్డీఏ సంకీర్ణం

మూడోసారి ప్రధానిగా ప్రమాణం

- మంత్రులుగా 72 మందికి అవకాశం
- ఎన్డీఏ మిత్రపక్షాలకు 11 మంత్రి పదవులు

న్యూఢిల్లీ: కేంద్రంలో ఎన్డీఏ సారథ్యంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. భారత ప్రధానమంత్రిగా మూడోసారి నరేంద్రమోదీ ప్రమాణస్వీకారం చేశారు. ఆదివారం సాయంత్రం రాష్ట్రపతి భవన్‌లో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మోదీ చేత ప్రమాణ స్వీకారం చేయించారు. మోదీతో పాటు కేంద్రమంత్రులుగా 72 మంది ప్రమాణస్వీకారం చేశారు. ఇందులో 30 మంది కేబినెట్ మంత్రుల కాగా, 36 మంది సహాయమంత్రులు, ఐదుగురు స్వతంత్ర హోదా కలిగిన మంత్రులు. 2014, 2019, 2024లో వరసగా మూడు పర్యాయాలు ప్రధానిగా మోదీ బాధ్యతలు చేట్టారు. దేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ తర్వాత వరుసగా మూడో సారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టి మోదీ రికార్డు సృష్టించారు. ప్రధాని మోదీతో పాటు కేంద్రమంత్రులులుగా రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, నితిన్ గడ్కరీ, జేపీ నడ్డా, శివరాజ్ సింగ్ చౌహాన్, నిర్మలా సీతారామన్, జైశంకర్, మనోహర్‌లాల్ ఖట్టర్, కుమారస్వామి (జేడీఎస్), పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, జితన్‌రాం మాంఝీ (హిందుస్థానా అవామ్ మోర్చా), లలన్ సింగ్ (జేడీయూ), సర్బానంద సోనోవాల్, వీరేంద్రకుమార్, ప్రహ్లాద్ జోషి, జుయల్ ఓరం, గిరిరాజ్ సింగ్, అశ్వనీ వైష్ణవ్, జ్యోతిరాదిత్య సింథియా, భూపేంద్ర యాదవ్, గజేంద్ర సింగ్ షెకావత్, అన్నపూర్ణాదేవి (జార్ఖండ్), కిరణ్ రిజిజు, హర్దీప్ సింగ్, మన్‌సుఖ్ మాండవీయ, కిషన్ రెడ్డి, చిరాగ్ పాస్వాన్ (ఎల్జేపీ), సీఆర్ పాటిల్, రావ్ ఇంద్రజీత్‌సింగ్, జితేంద్ర సింగ్, అర్జున్ మేఘవాల్, ప్రతాప్ రావ్ గణపత్ రావు జాదవ్, జయంత్ చౌదరి, జితిన్ ప్రసాద్, శ్రీపాద్ యశో నాయక్, పంకజ్ చౌదరి, క్రిషన్ పాల్, రాందాస్ అఠవలే ప్రమాణ స్వీకారం చేశారు. ఏపీ నుంచి టీడీపీకి చెందిన ఎంపీలు కింజారపు రామ్మోహన్‌నాయుడు కేబినెట్ మంత్రిగా, పెమ్మసాని చంద్రశేఖర్ సహాయమంత్రిగా, బీజేపీకి చెందిన భూపతిరాజు శ్రీనివాసర వర్మ సహాయమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. తెలంగాణ నుంచి బీజేపీ ఎంపీ కిషన్‌రెడ్డి కేబినెట్ మంత్రిగా, బండి సంజయ్ సహాయమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. ఎన్డీయేలోని మిత్ర పక్షాలకు చెందిన 11 మంది ఎంపీలకు మంత్రి పదవులు దక్కాయి. 72 మంది మంత్రుల్లో 43 మంది పార్లమెంటులో మూడు పర్యాయాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం పనిచేసిన వారు కాగా, 39 మంది ఇంతకు ముందు

- మిగతా 2 లో

మోదీ ప్రమాణ స్వీకారానికి దూరం

వామపక్ష నేతలు డి.రాజా, ఏచూరి నిర్ణయం

హాజరవ్వాలని ఖర్గే నిర్ణయం... టీఎంసీ దూరం

మోదీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి వామపక్ష పార్టీలు దూరంగా ఉండాలని నిర్ణయించాయి. తాము మోదీ ప్రమాణ స్వీకారోత్సవానికి వెళ్లడం లేదని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆదివారం తెలిపారు.

2లో

పెండింగ్ పనులపై దృష్టి

- రాజధాని ప్రాంతంలో సీఎస్ సుడిగాలి పర్యటన
- చంద్రబాబు ఆదేశాల మేరకేనని వెల్లడి

విశాలాంధ్ర-తుళ్లూరు: అమరావతి రాజధాని ప్రాంతంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదివారం సుడిగాలి పర్యటన చేశారు. ఈనెల 12న కొత్త ప్రభుత్వం కొలువు దీరనున్న నేపథ్యంలో సీఎస్ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. అసంపూర్తి నిర్మాణ పనులతో మధ్యలో ఆగిపోయిన వివిధ భవన నిర్మాణాలను సీఎస్ పరిశీలించారు. ముందుగా రాజధాని ప్రాంతానికి గతంలో భూమి పూజ జరిగిన ఉద్దండరాయునిపాలెంలోని సీఆర్డీఏ ప్రాజెక్టు స్థలాన్ని సందర్శించారు. తర్వాత అఖిల భారత సర్వీసు అధికారుల నివాస సముదాయ భవనాలను, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్వార్టర్లు, ఏపీ ఎన్జీఓల నివాస భవన సముదాయాలను పరిశీలించారు. అనంతరం హైకోర్టు అదనపు భవనాన్ని పరిశీలించారు. పర్యటనలో సీఎస్‌తో పాటు సీఆర్డీఏ కమిషనర్ వివేక్ యాదవ్, అదనపు కమిషనర్, ఎస్‌ఈ తదితర ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఉన్నారు. క్లియరెన్స్, స్ట్రీట్ లైట్లు, క్లీనింగ్‌పై వెంటనే దృష్టి పెట్టాలని సీఆర్డీఏ అధికారులకు నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ మీడియాతో మాట్లాడారు. కాబోయే సీఎం చంద్రబాబు ఇచ్చిన ఆదేశాల మేరకు

- మిగతా 2 లో

పార్లమెంటులో మీ గొంతుకగా నిలుస్తా...

'నీట్' పరీక్షలో అక్రమాలపై రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ : వైద్య విద్య ప్రవేశ పరీక్ష 'నీట్-యూజీ' లో అక్రమాలపై కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఆదివారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై విరుచుకుపడ్డారు. మోదీ కొత్త పదవీకాలం కోసం ప్రమాణం చేయకముందే 'నీట్ పరీక్షలో 'అక్రమాలు' 24 లక్షల మందికి పైగా విద్యార్థుల భవిష్యత్‌ను నాశనం చేశాయని అన్నారు. దేశంలోని విద్యార్థులకు తాను పార్లమెంటులో తమ గొంతుకగా నిలుస్తానని, వారి భవిష్యత్తుకు సంబంధించిన సమస్యలను గట్టిగా లేవనెత్తుతానని గాంధీ హామీ ఇచ్చారు. నీట్ వైద్య విద్య

- మిగతా 2 లో

ఉగ్రవాదుల కాల్పులు

లోయలోపడ్డ బస్సు... 10 మంది దుర్మరణం

2లో

అభయారణ్యమా... అదెక్కడ?

కనుమరుగవుతున్న కొల్లేటి పక్షులు

బోర్డులకే పరిమితమైన సంరక్షణ

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు : ఆసియాలోనే అతిపెద్ద మంచినీటి సరస్సు కొల్లేరులో గుడ్లు పెట్టేందుకు ఆవాసం కోసం దేశ విదేశాల నుంచి వచ్చే వలస పక్షులకు అనువైన వాతావరణం కరువైంది. నేడు సరస్సు పరిస్థితి కొల్లేరు ఆపరేషన్-2006 నాటికి ముందుకంటే ఘోరంగా తయారయ్యింది. అన్ని చోట్లా ఆక్రమణల పర్వం పెరిగిపోయింది. సరస్సులో ఎక్కడ చూసినా అక్రమ చెరువులే కనిపిస్తున్నాయి. పెలికాన్ లాంటి పక్షులు సహజ సిద్ధంగా చేపలు పట్టుకోవడానికి, గుడ్లు పెట్టడానికి నేడు కొల్లేరు సరస్సులో ఏమాత్రం వాతావరణం అనువుగా లేదు. దీంతో ప్రకృతి సహజ సౌందర్యంతో మానవాళి మనుగడకు ఎంతో మేలు కలగజేసే కొల్లేటి పక్షులు త్వరలో కనుమరుగు కావడం ఖాయంగా కనిపిస్తోంది. ముఖ్యంగా అటవీ శాఖ అధికారికంగా ప్రకటించిన 14 రకాల పక్షి జాతులు అంతరించిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. కొల్లేరు సరస్సులో పక్షుల సంరక్షణకు ప్రభుత్వం చేపడుతున్న

- మిగతా 2 లో

మందు బాబులకు కిక్కు

- నూతన మద్యం విధానంపై కసరత్తు
- 14న కొత్త విధానంపై ప్రకటన?
- ఇక మార్కెట్లోకి పేరొందిన బ్రాండ్లు
- తక్కువ ధరలకే అమ్మకం
- అవినీతి ఆరోపణలపై విచారణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ ప్రభుత్వంలో అమలైన మద్యం విధానాన్ని రద్దు చేసేందుకు రాబోయే కొత్త ప్రభుత్వం సిద్ధమైనట్లు తెలిసింది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే దీనికి ఆమోదముద్ర వేసే అవకాశముంది. ఈనెల 14వ తేదీన కొత్త మద్యం విధానం ప్రవేశపెట్టే దిశగా కసరత్తు జరుగుతోంది. ఆయా డిస్టిలరీల లైసెన్సులను రద్దు చేసి కొత్త విధానం తీసుకురానున్నారు. ఇదే అంశంపై ఇప్పటికే సీఎంఓలో చర్చ జరుగుతోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ప్రవేశపెట్టిన బ్రాండ్లను రద్దు చేసే దిశగా ప్రభుత్వ యంత్రాంగం కదలనుంది. వినియోగదారుడికి పేరొందిన అన్ని బ్రాండ్ల మద్యం అందించే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. బాధ్యతలు చేపట్టిన వెంటనే పాలనలో వెంటనే మార్పులు తేవాలన్న లక్ష్యంతో చంద్రబాబు ఈ రకమైన నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలిసింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అలవాటైన బ్రాండ్ల మద్యం అమ్మకాలను నిలిపివేసి నాసిరకం మద్యాన్ని అమ్మడంతో అవి తాగి చాలా మంది అనారోగ్యానికి గురయ్యారన్న విమర్శలున్నాయి. వివిధ రకాల కొత్త బ్రాండ్లను ప్రవేశపెట్టడంతో పాటు అధిక ధరలకు విక్రయించడంతో మద్యం ప్రియులు ఆర్థికంగా చితికిపోయారు. ఈ మద్యం

- మిగతా 2 లో

రామోజీరావుకు కన్నీటి వీడ్కోలు

విశాలాంధ్ర-హైదరాబాద్: రామోజీ గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు అంత్యక్రియలు రామోజీ ఫిల్మ్‌సిటీలోని స్మృతివనంలో జరిగాయి. తెలంగాణ ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో రామోజీరావు కుమారుడు కిరణ్ చేతులమీదుగా అంతిమ సంస్కారాలు నిర్వహించారు. అంతిమయాత్ర ఫిల్మ్‌సిటీలోని ఆయన నివాసం నుంచి రామోజీ గ్రూపు సంస్థల కార్యాలయాల మీదుగా స్మారక కట్టడం వరకు కొనసాగింది. సినీ, రాజకీయ, వ్యాపార, ఇతర రంగాలకు చెందిన ప్రముఖులు, రామోజీ గ్రూపు సంస్థల సిబ్బంది పెద్దఎత్తున పాల్గొన్నారు. ఏపీ ప్రభుత్వం తరపున ముగ్గురు అధికారులు హాజరయ్యారు. టీడీపీ అధినేత చంద్రబాబు కార్యక్రమానికి హాజరై రామోజీరావు పాడె మోశారు. తెలంగాణ పోలీసులు గౌరవవందనం సమర్పించారు. చంద్రబాబు, నారా లోకేశ్, ఎర్రబెల్లి

- మిగతా 2 లో

ఇదీ లోకం!

నాకు అచ్చేదినాలు వున్నంత వరకు పరిపాలిస్తానని.

శ్వేతసౌధం చుట్టిముట్టిన పలస్తీనా మద్దతుదార్లు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష భవనం శ్వేతసౌధం పరిసరాలు నిరసనలతో దద్దరిల్లాయి. గాజా-ఇజ్రాయిల్ యుద్ధం ముగించాలని, టెల్అవీవ్‌కు అగ్రరాజ్యం మద్దతు ఆపేయాలని ఆందోళన జరిగింది. దాదాపు 35 వేల మంది నిరసనకారులు ఆందోళనలో పాల్గొన్నారు. నిరసనలను ముందే ఊహించిన అధికారులు భద్రతను కట్టుదిట్టం చేశారు. నిరసనలకు సంబంధించిన వీడియోలు ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారాయి. ఈ ఆందోళనల్లో పాల్గొన్న వారు చాలామంది ఎర్రని వస్త్రాలు ధరించి.. ఫ్రీ పలస్తీనా, ఇజ్రాయిల్‌కు అమెరికా సైనిక సాయం ఆపేయాలని నినాదాలు చేశారు. కొందరు ఆందోళనకారులు దాదాపు 2 మైళ్ల పొడవైన బ్యానర్‌ను శ్వేతసౌధం వద్ద ప్రదర్శించారు. ఆపరేషన్ రఫాలో ఇజ్రాయిల్ రెడ్‌లైన్ దాటడాన్ని నిరసిస్తూ దీనిని ప్రదర్శించారు. యుద్ధం మొదలైన నాటి నుంచి రఫాలోనే పలస్తీనా వాసులు తలదాచుకుంటున్న విషయం తెలిసిందే. పొగ వెదజల్లే వస్తువులను శ్వేత సౌధ ప్రాంగణంలోకి నిరసనకారులు విసిరేశారు. ఈ సమయంలో అధ్యక్షుడు జోబైడెన్, ఆయన సతీమణి జిల్ ఇంట్లో లేరు. మరోవైపు వాషింగ్టన్ డీసీ మెట్రో పోలీసులు, సీక్రెట్ సర్వీస్ విభాగం దీనిపై స్పందిస్తూ... తాము ఒక్కరిని కూడా అరెస్టు చేయలేదని వెల్లడించారు. నేరుగా

శ్వేతసౌధానికి వెళ్లే రహదారి సహా అనేక మార్గాలు మూసివేశారు. అమెరికాలో గత నెలలో పలస్తీనా అనుకూల ఆందోళనలు మొదలయ్యాయి. విద్యాసంస్థల్లో తీవ్రస్థాయిలో ఇవి జరుగుతున్నాయి. ఈ ఆందోళనల దెబ్బకు వంతెనలు, వైట్‌హౌస్‌కు దారి తీసే రోడ్లను మూసేసి పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు.

హింసను ప్రోత్సహించడాన్ని ఆమోదించం: కెనడా

ఒట్టావా: హింసను ప్రేరేపించే పనులను ఏమాత్రం ఆమోదించబోమని కెనడా ప్రభుత్వం పేర్కొంది. గతవారం వాంకోవర్‌లో కొందరు ఖలిస్థానీ మద్దతుదారులు ఇందిరాగాంధీ హత్య చిత్రాలను ప్రదర్శించడంపై కెనడా పబ్లిక్ సేఫ్టీ మంత్రి డొమెనిక్ ఎల్ లిబ్లెన్స్ స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఇందిరాగాంధీ హత్య చిత్రాలను వాంకోవర్‌లో ప్రదర్శించారు. హింసను ప్రోత్సహించడాన్ని తాము ఎప్పటికీ ఆమోదించబోమని డొమెనిక్ పేర్కొన్నారు. మరోవైపు ఇండో-కెనడియన్ చట్టసభ సభ్యుడు చంద్ర ఆర్య మాట్లాడుతూ వాంకోవర్‌లోని ఖలిస్థానీ మద్దతుదారులు భారత ప్రధాని ఇందిరాగాంధీ హత్యకు సంబంధించిన చిత్రాలను ప్రదర్శించారు. హిందూ కెనడా వాసుల్లో భయాందోళనలు సృష్టించడమే వారి లక్ష్యం. కొన్నేళ్ల క్రితం బ్రాంప్టన్‌లో చేసిన కుట్రకు ఇది

కొనసాగింపు మాత్రమే. కొన్ని నెలల క్రితం అమెరికాకు చెందిన ఖలిస్థానీ వేర్పాటువాది పన్నూ మాట్లాడతూ కెనడాలోని హిందువులు తిరిగి భారత్‌కు వెళ్లిపోవాలని బెదిరించిన సంగతి తెలిసిందే. వీరు తుపాకుల చిత్రాలను ప్రదర్శిస్తూ సందేశం ఇవ్వాలనుకుంటున్నారు.

ఏమాత్రం చర్యలు తీసుకోకపోతే ఈ వైఖరి దేశానికి ప్రమాదకరంగా మారుతుందని హెచ్చరించారు. దేశంలోని శాంతిభద్రతల సంరక్షణ చూసే సంస్థలు తక్షణమే వీరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఖలిస్థానీ వేర్పాటువాదంలో పన్నూ కీలక వ్యక్తి. దీంతోపాటు సిఖ్స్ ఫర్ జస్టిస్‌లో న్యాయ సలహాదారుడిగా వ్యవహరిస్తున్నాడు. మరోవైపు కెనడాలో ఖలిస్థానీలను అదుపు చేయాలని భారత్ దీర్ఘకాలంగా అభ్యర్థిస్తూ వస్తోంది.

రామోజీరావుకు కన్నీటి వీడ్కోలు

(మొదటిపేజీ తరువాయి)

దయాకర్‌రావు, నామా నాగేశ్వరరావు, వి.హనుమంతరావు, కేఆర్ సురేశ్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, సుజనా చౌదరి, జూపల్లి కృష్ణారావు, అరికెపూడి గాంధీ, వెనిగండ్ల రాము సహా ప్రముఖులు పాల్గొన్ని కన్నీటి వీడ్కోలు పలికారు. రామోజీ గ్రూపు సంస్థల సిబ్బందిని, లక్షలాది మంది శ్రేయోభిలాషులను శోకసద్రంలో నెట్టి ఆయన వెళ్లిపోయారు. తన అంత్యక్రియల స్థలాన్ని(స్మారక కట్టడం) ముందుగానే రామోజీరావు నిర్ణయించుకున్నారు. దాన్ని ఉద్యానవంగా తీర్చిదిద్దారు. అక్కడే దహన సంస్కారాలు నిర్వహించాలని కుటుంబసభ్యులకు ముందుగానే ఆయన చెప్పారు.

మందు బాబులకు కిక్కు

(మొదటిపేజీ తరువాయి)

బ్రాండ్లలో అవినీతిపైనా నూతన ప్రభుత్వం విచారణకు సిద్ధమైనట్లు తెలిసింది. కాబోయే సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఈనెల 14వ తేదీన నూతన మద్యం విధానంపై తుది ఉత్తర్వులు వెలువరించాలన్న దిశగా అధికారులు దృష్టి సారించారు. నాడు సార్వత్రిక ఎన్నికల్లో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మద్యాన్ని దశలవారీగా నిషేధిస్తామని వైసీపీ ప్రకటించింది. దానికి విరుద్ధంగా రాష్ట్రంలో కొత్త మద్యం విధానం ప్రవేశపెట్టి... తీవ్ర విమర్శలపాలైంది. కనీవినీ ఎరుగని రీతిలో కొత్త మద్యం బ్రాండ్లను ప్రవేశపెట్టి అభాసుపాలైంది. ఈ మద్యం పాలసీలో భారీగా అవినీతి చోటు చేసుకుందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. టెండర్లలో వచ్చిన లొసుగులను ఆసారాగా తీసుకుని గతంలో ఎన్నడూ చూడని విధంగా మద్యం బ్రాండ్లను కట్టబెట్టారని, దానికి ప్రతిఫలంగా కోట్లాది రూపాయల అవినీతి జరిగినట్లు పేర్కొంటున్నాయి. మద్యం పాలసీ ఆదాయంపై రూ.25వేల కోట్ల రుణాన్ని గత ప్రభుత్వం తీసుకున్నట్లు తెలిసింది. ఫలితంగా కోట్లాది రూపాయలు పక్కదారి పట్టించినట్లు ప్రచారముంది. తాజాగా బాధ్యతలు చేపట్టనున్న టీడీపీ ప్రభుత్వం ఈ మద్యం పాలసీ విధానం అమలుపై విచారణకు రంగం సిద్ధం చేస్తోంది. ఆబ్కారీ శాఖలో చిట్టాను వెలికితీసేందుకు సమగ్ర విచారణకు దిగనుంది. 2019లో బ్రాండ్ కంపెనీలకు ఇవ్వాల్సిన బకాయిలను ఉద్దేశపూర్వకంగా అప్పటి సీఎం జగన్ ప్రభుత్వం నిలిపివేసిందని, మద్యం పాలసీ పేరుతో కొత్త చట్టాన్ని అమల్లోకి తెచ్చి మద్యం బ్రాండ్లపై ధరలను గతం కంటే మూడు రెట్ల ధరలకు పెంచిందన్న విమర్శలున్నాయి. వైసీపీ ప్రభుత్వ మద్యం పాలసీ విధానంపై మందు ప్రియులు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. తాగిన మందు కిక్కు ఎక్కకపోవడం, నాసి రకం సరుకు కావడం వెరసి అసంతృప్తితో ఉన్నారు. ఎన్నికల్లో చంద్రబాబు హామీ మేరకు ఐదేళ్లకు ముందు తాగిన పేరొందిన బ్రాండ్లు, గతం కంటే తక్కువ ధరకు మళ్లీ ప్రత్యక్షం కానుండటంతో మందు ప్రియులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

మోదీ 3.0

(మొదటిపేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వం లో మంత్రులుగా ఉన్నారు. మంత్రి మండలిలో ఓబీసీ నుంచి 27 మంది, షెడ్యూల్డ్ కులాల నుంచి 10 మంది, షెడ్యూల్డ్ తెగల నుంచి ఐదుగురు, మైనారిటీ వర్గాల నుంచి ఐదుగురుకి మంత్రి పదవులు దక్కాయి. ఈసారి ఐదుగురు తెలుగు ఎంపీలకు కేంద్ర మంత్రివర్గంలో చోటు దక్కింది. మోదీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి దాదాపు 8వేల మంది దేశ, విదేశీ ప్రముఖులతో పాటు సార్క్ సభ్య దేశాల నేతలు హాజరయ్యారు. వీరిలో మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ మొయిజ్జు, శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే, బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా, మారిషస్ ప్రధాని ప్రవింద్ కుమార్ జుగ్నాథ్, భూటాన్ ప్రధాని షెరింగ్ టోబ్గేతోబ్గే తదితరులు ఉన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, టీడీపీ అధినేత చంద్రబాబు, జేడీయూ అధినేత నితీశ్ కుమార్, జనసేన అధినేత పవన్ కల్యాణ్, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ, అదానీ గ్రూప్స్ అధినేత గౌతమ్ అదానీ, సినీనటులు షారుక్ ఖాన్, అక్షయ్‌కుమార్ రజనీకాంత్‌తో పాటు ఆధ్యాత్మికవేత్త చినజీయర్ స్వామి, వివిధ పీఠాలకు చెందిన అధిపతులు తరలివచ్చారు. ఇక మోదీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు. రాష్ట్రపతి భవన్ చుట్టూ బహుళ అంచెల భద్రత ఏర్పాటు చేశారు. దిల్లీలో సీసీ కెమెరాలు, డ్రోన్లతో అడుగడుగునా నిఘా ఏర్పాటు చేశారు. 5 కంపెనీల కేంద్ర బలగాలు, ఎన్ఎస్‌జీ కమాండోలను మోహరించారు. రాష్ట్రపతిభవన్ వద్ద 2,500 మంది పోలీసులతో భద్రతను పర్యవేక్షించారు.

ఏపీఎండీసీ కార్యాలయం సీజ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : తాడిగడపలోని ఆంధ్ర ప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) కార్యాలయాన్ని పోలీసులు సీజ్ చేశారు. ఏపీ ఎండీసీ ఎండీ వెంకటరెడ్డి బదిలీతో ఈ చర్యలకు శ్రీకారంచుట్టారు. ఏపీ ఎండీసీ కొత్త ఎండీగా ఐఏఎస్ అధికారి యువరాజ్ బాధ్యతలు స్వీకరించారు. అటు ఇబ్రహీంపట్నం, పెనమలూరులోని గనుల శాఖ కార్యాలయాలకు పోలీసులు తాళాలు వేశారు. కార్యాలయాన్ని పోలీసుల ఆధీనంలోకి తీసుకున్నారు. అనేక కీలక ఫైళ్లు ఉన్న నేపథ్యంలో వాటిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఫైళ్లు, హార్డ్ డిస్క్‌లు బయటకు వెళ్లకుండా అధికారులు అప్రమత్తమయ్యారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయాలు, ఇసుక లీజుల్లో కొందరికి లబ్ధి చేకూర్చాన్న ఆరోపణలపై ఈ చర్యలకు దిగారు. ప్రధానంగా గనులు, ఇసుక వ్యవహారాలకు చెందిన అన్ని ఫైళ్లు ఇక్కడే ఉన్నాయి. వాటిని మాయం చేస్తారన్న అనుమానంతో ఆయా కార్యాలయాల కీలక అధికారుల ఛాంబర్లను సీజ్ చేసి, అక్కడ పోలీసు నిఘా

పెంచారు. రాష్ట్రంలో సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయకముందే వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు సీజ్‌లకు ఆదేశించడం చర్చనీయాంశంగా మారింది. ఈ పరిణామాలు వైసీపీకి షాక్‌గా మారాయి. ముగిసిన వైసీపీ ప్రభుత్వ హయాంలోని కొన్ని శాఖల్లో అవినీతి జరిగిందన్న అనుమానం, ఆరోపణలతో ఈ చర్యలకు ఉపక్రమించారు. దీంతో ఆయా శాఖల అధికారులను బదిలీ చేసి, వారి స్థానంలో కొత్తవారిని నియమించగా, వారి ఆధ్వర్యంలో ఛాంబర్లను సీజ్ చేశారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసే సమయానికి ఈ కార్యాలయాలకు తాళాలు వేసే సంఖ్య మరింత పెరగనుంది.

ఈ నెల 12వ తేదీన సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన మరుసటి రోజు నుంచే ఈ తరహాగా కార్యాలయాలకు సీజ్‌ల పరంపర కొనసాగుతోంది. ఇప్పటికే ఏపీ సీఐడీ సిట్ కార్యాలయానికి తాళం వేసి, అక్కడ కూడా పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయాల నుంచి ఒక్క ఫైల్ కూడా వెళ్లకుండా ఉండేందుకు చర్యలు చేపట్టారు. సీఎం చంద్రబాబు ప్రమాణ స్వీకారం అనంతరం మంత్రులకు శాఖల కేటాయింపు, అధికారుల నియామకాలు, బదిలీలతో సీజ్ చేసిన కార్యాలయాలు తిరిగి ప్రారంభంకానున్నాయి. ఇప్పటికే కొందరు అధికారులు రిలీవ్‌పై వెళ్లేందుకుగా అభ్యర్థించగా, వారిలో కొందరివి తిరస్కరించారు.

మోదీ ప్రమాణ స్వీకారానికి దూరం

న్యూదిల్లీ : మోదీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి వామపక్ష పార్టీలు దూరంగా ఉండాలని నిర్ణయించాయి. తాము మోదీ ప్రమాణ స్వీకారోత్సవానికి వెళ్లడం లేదని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆదివారం తెలిపారు. అయితే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరుకావాలని నిర్ణయించారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగే ఈ వేడుకలకు ఖర్గేకు, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీకి ఆహ్వానం పంపినట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. అయితే మోదీ, ఆయన మంత్రివర్గం ప్రమాణ స్వీకారానికి ప్రతిపక్ష నాయకులు ఎవరూ హాజరుకావడం లేదు. వామపక్ష నేతలు డి.రాజా, సీతారాం చూరి ప్రమాణ స్వీకారోత్సవానికి వెళ్లడం లేదని చెప్పారు. టీఎంసీ నాయకురాలు సాగరికా ఘోష్ తన ఆహ్వాన లేఖను 'ఎక్స్' లో పోస్ట్ చేసి, వేడుకకు హాజరు కావడం లేదని చెప్పారు. 'గౌరవనీయులైన రాష్ట్రపతి భవన్. మీ సాదర ఆహ్వానానికి ధన్యవాదాలు. ప్రజల ఆదేశాన్ని కోల్పోయిన నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారానికి నైతిక చట్టబద్ధత లేనందున ప్రతిపక్షంలో ఉన్న మేము అంగీకరించనందున, నేను హాజరుకాకూడదని వ్యక్తిగత నిర్ణయం తీసుకున్నాను' అని పేర్కొన్నారు. మరొక టీఎంసీ నేత మాట్లాడుతూ 'ప్రమాణస్వీకారానికి ఎలాంటి పిలుపులు, ఆహ్వానం అందలేదు. మా అధినేత్రి (మమతా బెనర్జీ) ఇప్పటికే ప్రకటించారు. మేము ప్రమాణస్వీకారానికి హాజరుకావడం లేదు' అని తెలిపారు. ఇదిలాఉండగా, మమతా బెనర్జీ శనివారం జరిగిన తన పార్టీ ఎంపీల సమావేశంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ఎక్కువ కాలం కొనసాగదని అన్నారు.

అభయారణ్యమా... అదెక్కడ?

(మొదటిపేజీ తరువాయి)

చర్యలే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. వాస్తవానికి ప్రపంచంలోనే సహజ సిద్ధంగా మంచినీటితో 250 కిలోమీటర్లు పరిధిలో ఏర్పడిన కొల్లేరు సరస్సులో పక్షుల సంరక్షణ కోసం తీసుకున్న చర్యలు అత్యల్పం. ఇప్పటికే చాలా కొల్లేటి పక్షి జాతులు బొమ్మల రూపంలో పుస్తకాలకు పరిమితం అయిపోయాయి.

పక్షులు కనుమరుగయ్యే ప్రమాదం

కొల్లేరులో అటవీ శాఖ గుర్తించిన పక్షుల సంరక్షణ కేంద్రాలు సరస్సుకు వెళ్లే రోడ్లపై అక్కడక్కడ ఏర్పాటు చేసిన బోర్డులపై బొమ్మల రూపంలో మాత్రమే పక్షులు కనిపిస్తున్నాయి. అటవీ శాఖ తీసుకుంటున్న ఇలాంటి అరకొర చర్యల వల్ల కొల్లేరు సరస్సులో మిగిలి ఉన్న నాలుగైదు రకాల పక్షి జాతులు కూడా కొద్దికాలంలోనే కనిపించకుండా పోయే ప్రమాదం ఎంతో దూరంలో లేదని తెలుస్తోంది. కృష్ణా, పశ్చిమ, ఏలూరు జిల్లాల్లోని ఏడు నియోజకవర్గాల పరిధిలో విస్తరించి ఉన్న కొల్లేరు సరస్సులో 'మానవాళి మనుగడకు పక్షుల ప్రాముఖ్యత' పేరుతో అక్కడక్కడ బోర్డులను అటవీ శాఖ ఏర్పాటు చేసింది. అంతేతప్ప పక్షుల సంరక్షణ కోసం పటిష్టమైన చర్యలు తీసుకున్న దాఖలాలు ఏమీ లేవు. కృష్ణాజిల్లా ఆటపాక, ఏలూరు జిల్లా మాధవపురం వద్ద పక్షులు వాలడానికి ఇనుప స్తంభాలు ఏర్పాటు చేశారు. ఈ స్తంభాలపై కొద్ది సంఖ్యలోనే పక్షులు వాలుతున్నాయి. కొల్లేరు ఆక్రమణలకు గురికాక పూర్వం సైబీరియా, న్యూజిలాండ్, యూరప్, ఆఫ్రికా, పాకిస్తాన్, నేపాల్, ఉత్తర భారతదేశం, మయన్మార్ తదితర దేశాల నుంచి భారీ సంఖ్యలో వలస పక్షులు వచ్చేవి. వీటిలో పాము బాతు (డార్టర్), జెముడు తోక జకాన, గూడ బాతు (పెలికాన్), ఎర్ర కొంగ, చిన్న మునుగు కోడి (లిటిల్ గ్రేబి), గుడ్డి కొంగ (ఇండియన్ పాండ్ హెరాన్), నల్ల రెక్కల ఉల్లంగి (బ్లాక్ వింగ్డ్ స్టిల్ట్), చిన్న నీటి కాకి (లిటిల్ కార్మొరెంట్), ఊది చెంచు కోడి, కొండింగాయి (పర్పుల్ మూర్ హేన్), నల్లతల కంకణాల పిట్ట (బ్లాక్ హెడేడ్ ఓరియంటల్ వైట్ఐబిస్), ఈల వేసే పెద్ద చిలక (లార్జ్ విజిలింగ్ టీల్), (ఫుల్వాస్ విజిలింగ్ డక్), తెల్ల గూడ బాతు (వైట్ పెలికాన్) తదితర పక్షులు గుడ్లు పెట్టేందుకు శీతాకాలంలో వచ్చేవి. వర్షాకాలం ప్రారంభంలో తిరిగి తమ స్వస్థలానికి వెళ్లేవి.

కాలుష్య కోరలలో కొట్టుమిట్టాడుతూ...

కొల్లేరు సరస్సులో వాతావరణ కాలుష్యం పెరిగిపోవడంతో వీటిలో రెండు మూడు పక్షి జాతుల మినహా మిగిలినవి ఇక్కడికి రావడం లేదు. దేశంలో మిగిలిన ప్రాంతాల్లోని రక్షిత ప్రదేశాలకు వలస వెళ్లిపోతున్నాయి. ప్రధానంగా ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు, రెవెన్యూ, అటవీ, ట్రాన్స్‌కో, పోలీస్, ఇరిగేషన్, వ్యవసాయ, పర్యావరణ, డ్రెయినేజీ తదితర శాఖల పుణ్యమా అని కొల్లేరులోకి ఆక్రమణల

కారణంగా నీరు వచ్చే అవకాశం లేకుండా పోయింది. డ్రెయినేజీ వ్యవస్థ సరిగ్గా లేక ఎక్కడ మురుగు అక్కడ నిలిచిపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లడం పెరిగిపోయింది. మొత్తంగా కొల్లేరు కాలుష్య కాసారంగా మారిపోయింది. ప్రస్తుతం కొల్లేరులో ఎక్కడ చూసినా నల్లని రంగులోకి మారిన నీరు కనిపిస్తోంది. నేల రంగు కూడా పూర్తిగా మారిపోయింది. ఇన్ని కారణాల పక్షుల వలస కూడా భారీగానే తగ్గిపోయింది. ముఖ్యంగా కొల్లేరులో పక్షులకు ఆహారం, ఆవాసం కరువైంది. కొల్లేరు సరస్సులో పక్షులను వేటాడుకోవడానికి అనువుగా సహజంగా ఉండాల్సిన చెరువులు, నీటిమడుగులు, నెమ్మదిగా ప్రవహించే చిన్న నీటి వాగులు, కాలువలు నీటి గుంటలు లేవు.

సహజత్వం లోపించిన కొల్లేరు

కొల్లేరు సరస్సులో సహజత్వం లోపించడంతో నీటి నాణ్యతను మెరుగుపరిచే చిత్తడి నేలలు వృద్ధి చెందే అవకాశం లేకుండా పోయింది. ఫలితంగా కొల్లేరు సరస్సులో పక్షులకు ఆహారంగా ఉపయోగపడే చిన్న చిన్న చేపలు, చిరు కప్పలు, కప్పలు, బిరుసు పొరగల రొయ్యలు, నత్తలు, నీటి పురుగులు, పాకే పురుగులకు గింజలు, ధాన్యం దొరకట్లేదు. అన్నింటికన్నా ముఖ్యంగా వలస పక్షులు గుడ్లు పెట్టడానికి అవసరమైన కిక్కిస, తూడు, ఆవిరి గడ్డి, చిన్న చిన్న గుల్మాలు, పొదలు సరస్సులో ఎక్కడా లేవు. ఒక్క ముక్కలో చెప్పాలంటే 2006లో కొల్లేరు ఆపరేషన్ ముందు ఉన్న పరిస్థితి కంటే దారుణమైన వాతావరణం నేడు కొల్లేరులో ఎక్కడ చూసినా దర్శనమిస్తోంది. కాంటూర్‌తో సంబంధం లేకుండా పొగలు కక్కుతున్న ప్రొక్లెయినర్లు నిబంధనలకు విరుద్ధంగా చేపల చెరువులను తవ్వుతూ కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రామ్ సార్ సరస్సు ఒప్పందాలను, సుప్రీం కోర్టు సాధికార కమిటీ ఆదేశాలను అమలు చేసి కొల్లేరు సరస్సుకు గత వైభవం చేకూర్చేలా చర్యలు చేపట్టాలని ప్రకృతి ప్రేమికులు, పర్యావరణవేత్తలు, శాస్త్రవేత్తలు, ప్రజలు కోరుతున్నారు.

సంకీర్ణంలో ఏకపక్ష నిర్ణయాలు కుదరదు: అజయ్ రాయ్

న్యూదిల్లీ: సంకీర్ణ ప్రభుత్వంలో ఏకపక్ష ధోరణి సాధ్యం కాదని, ఇష్టానుసారం నిర్ణయాలు తీసుకోలేరని కాంగ్రెస్ నేత అజయ్‌రాయ్ చెప్పారు. అజయ్‌రాయ్ వారణాసిలో ప్రధాని నరేంద్రమోదీపై పోటీ చేసి...ఓటమి చెందారు. గత ప్రభుత్వానికి పూర్తి మెజారిటీ ఉందని, ఈసారి సంకీర్ణం ప్రభుత్వం కొలువుతీరుతోందని అన్నారు. బీజేపీ ప్రభుత్వానికి టీడీపీ, జేడీయూ, ఇతర

పార్టీలు మద్దతు ఇస్తున్నాయని చెప్పారు. గతంలో కాషాయ పాలకులు చేపట్టిన పనులు, వారి ఆలోచనా విధానం వేరని, అదే పోకడతో ఇప్పుడు వ్యవహరించడం కుదరదని స్పష్టం చేశారు. బీజేపీకి మద్దతు ఇస్తున్న పార్టీలు భిన్నమైనవని, వాటి సిద్ధాంతాలు వేర్వేరుగా ఉంటాయని అన్నారు.

ఉగ్రవాదుల కాల్పులు

లోయలోపడ్డ బస్సు...10 మంది దుర్మరణం

శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదుల దుశ్చర్య కారణంగా 10 మంది యాత్రికులు మృతి చెందారు. రియాసీ జిల్లాలో యాత్రికులతో ప్రయాణిస్తున్న బస్సుపై ముష్కరులు కాల్పులు జరపడంతో బస్సు లోతైన లోయలో పడినట్లు అధికారులు తెలిపారు. అనేక మంది

తీవ్రంగా గాయపడినట్లు చెప్పారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు వెల్లడించారు. శివఖోరీ ఆలయానికి వెళ్తున్న క్రమంలో బస్సుపై ఉగ్రవాదులు కాల్పులకు తెగబడినట్లు పేర్కొన్నారు. ఘటనాస్థలంలో పారామిలటరీ, సైన్యం సహాయక చర్యల్లో పాల్గొన్నట్లు అధికారులు తెలిపారు.

పార్లమెంటులో మీ గొంతుకగా నిలుస్తా...

(మొదటిపేజీ తరువాయి)

ప్రవేశ పరీక్షలో మార్కుల అక్రమాల ఆరోపణల మధ్య, 1,500 మందికి పైగా అభ్యర్థులకు గ్రేస్ మార్కులను సమీక్షించడానికి విద్యా మంత్రిత్వ శాఖ నలుగురు సభ్యుల ప్యానెల్‌ను ఏర్పాటు చేసినట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) శనివారం ప్రకటించింది. 'ఎక్స్'పై హిందీలో ఒక పోస్ట్‌లో రాహుల్ గాంధీ... 'నరేంద్ర మోదీ ఇంకా ప్రమాణ స్వీకారం చేయలేదు. నీట్ పరీక్షలో అక్రమాలు 24 లక్షల మందికి పైగా విద్యార్థుల భవిష్యత్‌ను, వారి కుటుంబాలను నాశనం చేశాయి' అని పేర్కొన్నారు. ఒకే పరీక్షా కేంద్రం నుంచి ఆరుగురు విద్యార్థులు గరిష్ఠ మార్కులతో పరీక్షలో అగ్రస్థానంలో నిలిచారు. అయితే చాలా మందికి సాంకేతికంగా సాధ్యం కాని మార్కులు వచ్చాయి. అయితే పేపర్ లీక్ అయ్యే అవకాశాన్ని ప్రభుత్వం నిరంతరం నిరాకరిస్తున్నదని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు తెలిపారు. విద్యా మాఫియా, ప్రభుత్వ యంత్రాంగంతో కుమ్మక్కయ్యి నడుస్తున్న ఈ 'పేపర్ లీక్ పరిశ్రమ' ను ఎదుర్కోవడానికి కాంగ్రెస్ పటిష్టమైన ప్రణాళికను రూపొందించిందన్నారు. చట్టం చేయడం ద్వారా విద్యార్థులకు పేపర్ లీక్ నుంచి విముక్తి కల్పిస్తామని తమ మేనిఫెస్టోలో హామీ ఇచ్చామని చెప్పారు. 'ఈ రోజు, నేను పార్లమెంటులో మీ గొంతుకగా మారతాను. మీ భవిష్యత్తుకు సంబంధించిన సమస్యలను గట్టిగా లేవనెత్తుతానని దేశంలోని విద్యార్థులందరికీ నేను హామీ ఇస్తున్నాను' అని గాంధీ చెప్పారు. తమ గొంతును అణచివేయనివ్వని ఇండియా ఐక్య సంఘటనపై యువత విశ్వాసం వ్యక్తం చేశారని నొక్కి చెప్పారు. అయితే 'నీట్'లో అక్రమాలు జరిగాయన్న వార్తలను ఎన్‌టీఏ తోసిపుచ్చింది. వైద్య కోర్సుల జాతీయ పరీక్షల ప్రామాణికతపై అనేక పార్టీలు ఆందోళనలు చేయడంతో ఈ అంశం రాజకీయ మలుపు తిరిగింది. వైద్య కోర్సుల కోసం నీట్‌లో అక్రమాలపై సుప్రీం కోర్టు పర్యవేక్షణలో ఉన్నత స్థాయి దర్యాప్తు జరపాలని కాంగ్రెస్ శుక్రవారం డిమాండ్ చేసింది. బీజేపీ యువతను మోసం చేసి వారి భవిష్యత్తుతో ఆడుకుంటోందని ఆరోపించింది.

పెండింగ్ పనులపై దృష్టి

(మొదటిపేజీ తరువాయి)

రాజధానిలోని భవనాలు పరిశీలిస్తున్నామని సీఎస్ చెప్పారు. ముందుగా శంకుస్థాపన ప్రాంతం పరిశీలించి అక్కడ పారిశుద్ధ్య పనులు పర్యవేక్షించామని, రాజధాని అమరావతి ప్రాంతంలో 34 చోట్ల 94 జేసీబీలతో జంగిల్ క్లియరెన్స్ పనులు కొనసాగుతున్నాయన్నారు. మొత్తం 25 పనులపై వెంటనే దృష్టి సారించిజ... పనులు ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. రాజధాని శంకుస్థాపన ప్రాంతం, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్స్, అఖిలభారత సర్వీస్ అధికారుల క్వార్టర్స్, గ్రూప్ 4 ఎంప్లాయీస్ బిల్డింగ్‌లను సీఎస్ పరిశీలించారు. సీఎం చంద్రబాబు ప్రమాణ స్వీకారం కన్నా ముందే రాజధాని పనుల స్థితిగతులపై నివేదిక అందజేస్తామని సీఎస్ వెల్లడించారు. వెంటనే 25 చోట్ల పనులు ప్రారంభించాలని సీఎం ఆదేశించారన్నారు. రాజధాని శంకుస్థాపన ప్రాంతం, సీడ్ యాక్సిస్ రోడ్డు మిగిలి ఉన్న పనులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, అఖిలభారత సర్వీస్ అధికారుల క్వార్టర్లు తదితర పనులు వెంటనే ప్రారంభిస్తామన్నారు. అనేక కార్యాలయాల్లో ఫైళ్లు మాయమవడం, కరెక్ట్ అవ్వడం లాంటివి జరుగుతాయన్న అనుమానాలు ఉన్నాయని, దీనికి సంబంధించి ఫిర్యాదులు రావడంతో సీఐడీ, సిట్ ఆఫీసు, మైన్స్ కార్యాలయం, బేవరేజెస్ కార్యాలయాలకు సీల్ వేశామని నీరబ్ కుమార్ ప్రసాద్ వివరించారు.

ఐదు మంత్రి పదవులు

(మొదటిపేజీ తరువాయి)

నుంచి గెలిచిన ఇద్దరిలో ఎవ్వరికీ కేంద్రంలో మంత్రి పదవి పదవి లభించకపోవడంతో నిరుత్సాహానికి గురయ్యారు. ఏపీ ఎన్డీఏ కూటమి 21 ఎంపీ స్థానాల్లో గెలుపులో జనసేన శ్రేణులు ప్రధాన పాత్ర పోషించారని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. జనసేన లేకుంటే కూటమికి ఇన్ని సీట్లు వచ్చేవి కాదని బహిరంగంగానే చెబుతున్నారు. టీడీపీకి చెందిన నెల్లూరు, ఒంగోలు ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాగుంట శ్రీనివాసులురెడ్డి కూడా కేంద్ర మంత్రి పదవులు ఆశించి భంగపడ్డారు.

అవిశ్రాంత బహుముఖ శ్రామికుడు రామోజీ: అరసం

విశాలాంధ్ర-హైదరాబాద్: ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు మరణం పట్ల తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం ఓ ప్రకటనలో సంతాపం వ్యక్తం చేసింది. సాధారణ కుటుంబంలో పుట్టి బహుముఖ శ్రమతో అసాధ్యాలను సుసాధ్యం చేసి పట్టుదలకు మారుపేరైన రామోజీ తెలుగు భాషా సాహిత్యాలకు ఎనలేని కృషి సలిపారని కొనియాడింది. అరసం అధ్యక్షుడు డా. పల్లేరు వీరస్వామి, ప్రధాన కార్యదర్శి డా.రాప్రోలు సుదర్శన్ తదితరులు రామోజీరావుకు అశ్రు నివాళి అర్పిస్తూ... ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

ఇసుక మాఫియా దుర్మార్గం

పాట్నా: బీహార్‌లో ఇసుక మాఫియా రెచ్చిపోయింది. ఔరంగాబాద్ జిల్లాలో ఓ కానిస్టేబుల్‌ను ట్రాక్టర్‌తో తొక్కించి చంపినట్లు పోలీసులు తెలిపారు. దౌద్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముసేపూర్ ఖైరా గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటలకు ఈ ఘటన జరిగింది. వివరాల ప్రకారం.. భోజ్‌పూర్ జిల్లాలోని అర్రా గ్రామానికి చెందిన దీపక్ కుమార్ (29) కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇసుక మైనింగ్‌లో తనిఖీ చేస్తుండగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను నిలువరిచేందుకు యత్నించారు. వాహనాన్ని ఆపాలని డ్రైవర్‌కు సూచించారు. అయితే దీపక్ కుమార్‌ను డ్రైవర్ ట్రాక్టర్‌తో తొక్కించి... అక్కడి నుండి పరారయ్యాడు.

దాడులు ఆగవా?

- దారితప్పిన శాంతిభద్రతలు
- ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం
- భయాందోళనలో ప్రజలు
- పోలీస్ యంత్రాంగం వైఫల్యం

విశాలాంధ్రబ్యూరో-అమరావతి: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం మొదలైన హింసాత్మక సంఘటనలు ఇంకా అదుపులోకి రావడం లేదు. పార్టీల శ్రేణులు దాడులకు తెగబడుతున్నప్పటికీ వాటిని అదుపు చేయడంలో పోలీసు యంత్రాంగం విఫలమైందన్న విమర్శ లున్నాయి. ప్రజస్వామ్యంలో గెలుపోటములు సహజమైన ప్పటికీ దానిని రాజకీయ పార్టీల శ్రేణులు గుర్తెరగకుండా పోటాపోటీగా హింసాత్మక దాడులకు పాల్పడుతున్నారు. అధికార పక్షం, లేక ప్రతిపక్షం ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం సరికాదు. గెలిచిన వారు, ఓడిన వారు అదే రీతిలో వ్యవహరించడం దురదృష్టకరం. ఎన్నికల ఫలితాల అనంతరం ఈ దాడులు మితిమీరిపోవడంతో శాంతి భద్రతలు పక్కదారి పట్టాయి. చాలా ప్రాంతాల్లో పోలీసుల సమక్షంలోనే దాడులు జరిగినప్పటికీ చూసీచూడనట్లు వదిలేశారు. ఇదంతా పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినా వారిలో బదిలీల గుబులు నెలకొంది. అందుకే పూర్తి స్థాయిలో స్పందించడం లేదు. పట్టణాలు, గ్రామాల్లో నడిరోడ్డుపైకి వచ్చి కర్రలు, కత్తులు చేతితో తిప్పుతూ, రాళ్లతో విధ్వంసం సృష్టిస్తుంటే... సామాన్య ప్రజలు బెంబేలెత్తుతున్నారు. వైసీపీ ప్రభుత్వ విధానాలు, అమలు చేసిన కార్యక్రమాలు నచ్చకపోతే... రాబోయే కొత్త ప్రభుత్వం ద్వారా అధికారికంగా మార్పులు, చేర్పులు చేసుకోవాలేగాని, ఇలా దాడులకు తెగబడటాన్ని ప్రజలు తప్పుబడుతున్నారు. ఓటమికి గురైన వైసీపీ నేతలు సైతం తమ తప్పిదాలను తెలుసుకుని నిర్మాణాత్మకంగా వ్యవహరించకుండా...గెలిచిన వారిపై దాడులకు దిగడాన్ని ప్రజలు హర్షించడం లేదు. ఎన్డీఏ కూటమి పార్టీలకు చెందిన టీడీపీ, జనసేనకు చెందిన కొంతమంది అల్లరి మూక లు ప్రభుత్వ కార్యాలయాల బోర్డులను తొలగించడం, ధ్వంసం చేయడం తదితర సంఘటనలు వెరసి రాబోయే కొత్త ప్రభుత్వానికి అపకీర్తి తెచ్చిపెట్టే పరిస్థితులున్నాయి. తమకు ఓట్లు వేయలేదన్న కక్షతో ఇళ్లపై దాడులకు దిగి సామాగ్రిని ధ్వంసం చేస్తున్న సంఘటనలతో పరిస్థితులు అదుపు తప్పుతున్నాయి. గ్రామ, వార్డు సచివాలయాలు, ఆర్బీకే కేంద్రాల బోర్డులను తొలగించడం, లోపల కార్యాలయాల్లోని విలువైన కంప్యూటర్లు, ఫర్నీచర్‌ను పనికట్టుకుని ధ్వంసం చేస్తున్న సంఘటనలు ఉద్యోగు లను, స్థానికులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. విశ్వవిద్యాలయాలకు వెళ్లి బోర్డులను తొలగించి, వీసీలపై అల్లరి మూకలు కాలు దువ్వుతూ శాంతిభద్రతలను అదుపులోకి తీసుకుంటున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన తప్పిదాలను చట్ట పరంగా, న్యాయపరంగా, ప్రభుత్వ పరంగా ఎదుర్కో వాలేగానీ దాడులకు దిగితే ప్రయోజనం ఏమీ ఉండదని ప్రజలు సూచిస్తున్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటికీ... ఇంకా రాజకీయ నేతల పర్యటనల్లో పరస్పరం రాళ్లు రువ్వుకోవడం, కార్ల అద్దాలను ధ్వంసం చేసుకోవడం వంటి ఘటనలు కొనసాగుతున్నాయి. కాకినాడజిల్లా పిఠాపురంలో ఈ తరహా సంఘటనలు చోటు చేసుకోవడంపై పోలీసుల వైఫల్యంగా కన్పిస్తోంది. చట్టాన్ని చేతులోకి తీసుకుని దాడులకు పాల్పడితే... వారిపై కఠిన చర్యలు తీసుకుంటేనే రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపులో ఉంటాయి. ఈ దాడులను నియంత్రించకుంటే మరిన్ని విధ్వంసాలు, ఘర్షణలు కొనసాగే ప్రమాదముంది. రాజకీయ పార్టీల అధినేతలు దాడుల సంస్కృతిని వీడాలని పార్టీ శ్రేణులకు పిలుపునివ్వాలని ప్రజలు కోరుతున్నారు.

వృద్ధాశ్రమానికి 'స్ట్రీట్‌కాజ్' వితరణ

హైదరాబాద్: హైదరాబాద్‌లో స్ట్రీట్‌కాజ్ స్వచ్ఛంద సంస్థ... మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తులకు సంరక్షణ అందించే 'మీన్స్ ఓల్డేజ్ హోమ్'కు 250 కిలోల బియ్యం, 50 కిలోల వివిధ పప్పులు తదితర నిత్యావసరాలు సహా రూ.50వేల విలువైన కిరాణా సామాగ్రిని విరాళంగా అందజేసింది. ఈ స్వచ్ఛంద సంస్థ పూర్తిగా విద్యార్థులచే నిర్వహించబడుతుండటం విశేషం. ఇటీవల వృద్ధాశ్రమాన్ని సందర్శించిన సంస్థ బృందం... అక్కడ నిత్యావసరాల కొరత ఉండటంతో ఆశ్రయం పొందిన వృద్ధులకు కేవలం అన్నం, పప్పు మాత్రమే వండి పెడుతున్నట్లు గ్రహించింది. వెంటనే సంస్థ వలంటీర్ల బృందం నిధులు సేకరించి ఆశ్రమానికి అవసరమైన కిరాణా సామాగ్రిని అందించింది.

వైఎస్సార్ విగ్రహాలపై వికృత దాడులా

కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలపై అల్లరి మూకలు చేస్తున్న వికృత దాడులను కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు షర్మిల తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేస్తూ, ప్రజాస్వామ్యంలో ఇలాంటి అరాచకాలు జరగడం అత్యంత దారుణమని, మిక్కిలి శోచనీయమని పేర్కొన్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ ఇలాంటి రౌడీ చర్యలను ఖండించి తీరాల్సిందేనని, ఇది పిరికిపందల చర్య తప్ప మరోటి కాదన్నారు. తెలుగువాళ్ల గుండెల్లో గూడుకట్టుకున్న వైఎస్సార్ విశేష ప్రజాదరణ పొందిన నాయకులని, తెలుగు ప్రజల హృదయాల్లో ఆయనది చెరపలేని ఒక జ్ఞాపకమని వివరించారు. అలాంటి నేతకు నీచ రాజకీయాలు ఆపాదించడం సరికాదని, గెలుపు ఓటములు ఆపాదించడం తగదన్నారు. వైఎస్సార్‌ను అవమానించేలా ఉన్న ఈ హీనమైన చర్యలకు బాధ్యులైన వారిపై వెనువెంటనే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

గీత దాటితే చర్యలు

ఏపీ నేతలకు కాంగ్రెస్ అధిష్ఠానం హెచ్చరిక

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ కాంగ్రెస్ నేతలు గీత దాటవద్దంటూ అధిష్ఠానం హెచ్చరికలు జారీ చేసింది. పార్టీపై, నేతలపై బహిరంగ విమర్శలు చేయకూదని ఆదేశించింది. ఆంధ్రప్రదేశ్‌లో కొంతమంది నాయకులు ఇష్టానుసారం మీడియా ముందు ఆరోపణలు చేస్తున్నారని అధిష్ఠానం ఓ ప్రకటనలో పేర్కొంది. దీనిపై ఏఐసీసీ కార్యదర్శి సీడీ మెయ్యప్పన్ వివరణ ఇచ్చారు. పార్టీకి చెందిన కొంతమంది టీవీ ఛానళ్లు, సోషల్ మీడియాలో విపరీతంగా ఆరోపణలు చేస్తూ పార్టీ ప్రతిష్ఠను దిగజార్చుతున్నారని మెయ్యప్పన్ తెలిపారు. ఫిర్యాదులపై పార్టీ వేదికలోనే చర్చించాలి తప్ప మీడియాకు ఎక్కొద్దన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ లేదా సోషల్ మీడియా ద్వారా స్పందించడం సరికాదని అధిష్ఠానం తెలిపినట్లు ఆయన వివరించారు. గీత దాటితే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భవిష్యత్తులో పార్టీ సభ్యులు తమ ఫిర్యాదులను మీడియాకు తీసుకెళ్లడం మానుకోవాలని అధిష్ఠానం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీచేసిన అభ్యర్థులు విజయవాడ ఆంధ్రరత్నభవన్‌లో రెండ్రోజుల కిందట సమావేశం నిర్వహించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలపై రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ ఘాటు వ్యాఖ్యలు చేశారు. పార్టీలో నిజమైన కార్యకర్తలకు అన్యాయం జరిగిందని, ఎన్నికల కోసం అధిష్ఠానం నిధులు పంపిస్తే షర్మిల దాచుకున్నారని సుంకర పద్మశ్రీ చేసిన ఆరోపణలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి.

రామోజీ మృతి పత్రికా రంగానికి తీరని లోటు

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఈనాడు సంస్థల అధినేత, పద్మశ్రీ అవార్డు గ్రహీత రామోజీరావు మృతి పత్రికా రంగానికి తీరని లోటని, ఆయన మృతి పట్ల ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు సంతాపం తెలిపారు. రామోజీ పత్రికా రంగంలో నూతన ఒరవడి సృష్టించి విభిన్న రంగాలు, శాఖలుగా వ్యాపారాన్ని విస్తరించి, వేలాది మందికి ఉపాధి కల్పించారని వివరించారు. తెలుగు భాషకు గొప్ప సేవ చేశారని కొనియాడారు. డాక్టర్ బూదరాజు, రాంభట్ల, కృష్ణమూర్తి, గజ్జెల మల్లారెడ్డి, ఆర్వీ రామారావు లాంటి అనేక మంది ఉద్దండుల పాండిత్యాన్ని, ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప వ్యక్తి రామోజీరావు అని ఓబులేసు పేర్కొన్నారు.

రామోజీ మృతి నన్ను కలచివేసింది : సినీగేయ రచయిత వందేమాతరం శ్రీనివాస్

రామోజీ ఫిల్మ్‌సిటీ సృష్టికర్త రామోజీరావు మరణవార్త నన్ను ఎంతగానో కలచి వేసిందని ప్రముఖ సినీ గేయ రచయిత వందేమాతరం శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈటీవీ నిర్వహించిన అనేక కార్యక్రమాల్లో తాను పాల్గొన్నానని, అనేక సందర్భాల్లో వారిని కలిశానని గుర్తు చేశారు. ఎంతో ప్రేమ, ఆప్యాయత కలిగిన మహోన్నతమైన వ్యక్తిత్వం ఆయనదని కొనియాడారు. అక్కినేని నాగేశ్వరరావు నటించిన కోడి రామకృష్ణ దర్శకత్వంలో రామోజీ నిర్మించిన డాడీ... డాడీ అనే చిత్రానికి తనకు సంగీతం సమకూర్చే అవకాశం కలి గిందన్నారు. ఆ చిత్రానికి సంబంధించిన పాటలకు ఆయన దగ్గరుండి మరీ సూచనలు, సలహాలు ఇచ్చి చేయించుకున్నారని తెలిపారు. రామోజీ మృతి చాలా బాధకరమని, నేను అమెరికాలో ఉన్నందువల్ల ఆయనను చివరి సారిగా చూడలేకపోతున్నానని పేర్కొంటూ రామోజీకి శ్రద్ధాంజలి ఘటించారు.

రామోజీ మృతి పట్ల ఏపీ జేఏసీ అమరావతి సంతాపం

రామోజీరావు మరణం పత్రిక రంగానికి తీరని లోటని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, స్టేట్ సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు ఆదివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. రామోజీరావు అతి సామాన్య కుటుంబంలో పుట్టి తన నిరంతర శ్రమ, కృషి, పట్టుదలతో, అనితర ప్రతిభతో పత్రికా రంగంలో ఉన్నత శిఖరాలకు చేరుకున్న గొప్పమనిషి అని, ఆయన నేటి యువతరానికి ఆదర్శప్రాయుడు అని వారు కొనియాడారు. అతి సామాన్యులను సైతం తన మీడియా ద్వారా వెలుగులోకి తేవడం, మారుమూల కుగ్రామాల్లోని సమస్యలు సైతం ప్రభుత్వాలకు, బాహ్య ప్రపంచానికి చాటి చెప్పడం విజయవంతంగా నిర్వహించారని గుర్తు చేశారు. రామోజీ మృతి పట్ల ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

జడ్చర్ల జైన శాసనాన్ని కాపాడుకోవాలి

పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి

జడ్చర్ల: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పంచాయతీ కార్యాలయం వెంకటేశ్వర ఆలయాల్లో ఉన్న క్రీ.శ 12వ శతాబ్ది శాసనాలను కాపాడుకోవాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా సీఈఓ, డా.ఈమని శివనాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు. పంచాయతీ కార్యాలయంలో ఉన్న క్రీ.శ 1125వ సంవత్సరం జనవరి 21వ తేదీ నాటి కల్యాణి చాళుక్య చక్రవర్తి మూడో సోమేశ్వరుని కుమారుడు కందూరు యువరాజైన మూడో తైలపుడు పాలిస్తుండగా... మూల సంఘానికి చెందిన మేఘచంద్ర భట్టారకుడు వేయించిన జైన శాసనంలో గంగాపురంలోని పార్శ్వనాథ చైత్య అలయ ప్రస్తావన ఉందని, ప్రస్తుతం గంగాపురం వద్ద గల గొల్లత్తగుడి ఇటుక ఆలయమే జైన చైత్యాలమని, దాన్ని పునరుద్ధరించి, ఈ శాసనాన్ని అక్కడకు తరలించాలని అఖిలభారత ప్రాచీన ఆలయ జీర్ణోద్ధరణ ట్రస్ట్ చైర్మన్ ఆర్‌కే జైన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక వెంకటేశ్వర ఆలయంలో గల క్రీ.శ.1162 నాటి కందూరు చోళ వంశానికి చెందిన రెండో ఉదయన చోడుడు, కోడూరు స్వయంభు సోమేశ్వరనాథుని నిత్య అర్చనలకు ఐదు గోకర్ణ సింగ రూకలను, గంగాపురం నుంచి వచ్చే ఆదాయాన్ని దానం చేసినట్లుగా ఉందని శివనాగిరెడ్డి చెప్పారు. కార్యక్రమంలో ఆ సంస్థ కో-చైర్మన్ ముకేశ్‌కుమార్ జైన్, స్థానిక ఆలయ పూజారి, వారసత్వ ప్రేమికుడు అన్ష్ జైన్ పాల్గొన్నారు. ఆ శాసనంపై ఉన్న సున్నాన్ని తొలగించాలని శివనాగిరెడ్డి ఆలయ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

నీట్ పరీక్ష ఫలితాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ

శివారెడ్డి డిమాండ్

జులై 8, 9, 10 తేదీలలో ఏఐఎస్ఎఫ్ శిక్షణ తరగతులు

విశాలాంధ్ర-కాకినాడ: నీట్ పరీక్ష ఫలితాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి డిమాండ్ చేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) విడుదల చేసిన నీట్ పరీక్ష ఫలితాలలో దేశవ్యాప్తంగా 67 మంది విద్యార్థులకు 720 మార్కులకుగాను 720 రావడం, అందులో ఆరుగురు విద్యార్థులు హర్యానాలోని ఒకే సెంటర్‌కి సంబంధించిన వారు కావడం అనేక అనుమానాలకు తావిస్తున్నదని అన్నారు. తక్షణమే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాకినాడలోని పీఆర్ భవన్‌లో ఆయన ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే నీట్ పరీక్షను రద్దు చేయాలని దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు డిమాండ్ చేస్తున్నా... కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వేలాదిమంది ప్రతిభగల విద్యార్థులు మెడికల్ విద్యకు దూరమవుతున్నారని శివారెడ్డి చెప్పారు. నీట్ పరీక్ష ఫలితాలపైనా, పేపర్ లీకేజీపైనా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డిపై ఆయన ఆరోపణలు చేశారు. విశ్వవిద్యాలయాల ప్రతిష్ఠను దెబ్బతీస్తున్న వైస్‌చాన్సలర్లను తక్షణమే బర్తరఫ్ చేయాలన్నారు. విద్యారంగంలో వస్తున్న మార్పులపై సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులపై విద్యార్థుల్లో చైతన్యం నింపడానికి జులై 8, 9, 10 తేదీల్లో కాకినాడ పట్టణంలో రాష్ట్రస్థాయి విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. రాజకీయ పాఠశాల కరపత్రాలను ఏఐవైఎఫ్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి తాటిపాక మధు ఆవిష్కరించారు. ఏఐఎస్ఎఫ్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గండి రవి, చింతలపూడి సునీల్, జిల్లా నాయకులు వెంకట్, మోహన్ దుర్గా, రవితేజ, సునీల్ తదితరులు పాల్గొన్నారు. శిక్షణాతరగతులకు ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి కె.బోడకొండ సంఘీభావం ప్రకటించారు.

హమ్మయ్య గెలిచాం...

తక్కువ మెజార్టీలతో నెగ్గిన ఎమ్మెల్యేలు

సీనియర్లను ఓటమి పాల్జేసిన నేతలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సార్వత్రిక ఎన్నికల్లో తక్కువ ఓట్లతో వివిధ పార్టీల ఎమ్మెల్యేలు గట్టెక్కారు. వారిలో కొత్త, పాత నేతలు ఉన్నారు. రాజకీయంలో సీనియర్లుగా ఉన్న నేతలను సైతం ఓటమి పాల్జేశారు. స్వల్ప ఓట్ల మెజార్టీల ఆధారంగా చూస్తే... 351 నుంచి 6,049 ఓట్ల తేడాతో గెలిచిన పది మంది ఎమ్మెల్యేల వివరాలిలా ఉన్నాయి. నంద్యాల జిల్లా డోన్ టీడీపీ ఎమ్మెల్యేగా కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డి 6,049 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈయన తన సమీప వైసీపీ అభ్యర్థి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని ఓడించి, అతి తక్కువ ఓట్ల మెజార్టీతో విజయం సాధించిన వారిలో 10 స్థానంలో నిలిచారు. అన్నమయ్య జిల్లా మదనపల్లి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా మహ్మద్ షాజహాన్ బాషా 5,509 స్వల్ప ఓట్ల మెజార్టీతో గెలుపొంది 9వ స్థానంలో నిలిచారు. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం వైసీపీ అభ్యర్థిగా తాటిపర్తి చంద్రశేఖర్ 5,200 స్వల్ప ఓట్ల మెజార్టీతో విజయం సాధించి 8వ స్థానంలో ఉన్నారు. తిరుపతి జిల్లా సత్యవేడు టీడీపీ అభ్యర్థి కోనేటి ఆదిమూలం 3,739 ఓట్లతో గెలుపొంది, ఏడవ స్థానంలో నిలిచారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం బీజేపీ అభ్యర్థిగా సత్యకుమార్ పోటీ చేసి 3,734 ఓట్ల మెజార్టీతో తన సమీప వైసీపీ అభ్యర్థి కేతిరెడ్డి వెంకటరెడ్డిని ఓడించి ఆరో స్థానంలో నిలిచారు. కర్నూలు జిల్లా ఆలూరు వైసీపీ అభ్యర్థి విరూపాక్షి 2,831 స్వల్ప ఓట్ల మెజార్టీతో విజయం సాధించి, ఐదవ స్థానంలో ఉన్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రామప్రసాద్ రెడ్డి 2,495 అతి తక్కువ ఓట్లతో గెలుపొందిన వారిలో నాలుగవ స్థానంలో ఉన్నారు. ఈయన తన సమీప వైసీపీ అభ్యర్థి గడికోట శ్రీకాంత్‌రెడ్డిని ఓడించారు. ప్రకాశం జిల్లా దర్శి వైసీపీ అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి 2,456 స్వల్ప ఓట్ల మెజార్టీతో విజయం సాధించి మూడవ స్థానంలో నిలిచారు. గిద్దలూరు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి ముద్దుమూరి అశోక్‌రెడ్డి 930 స్వల్ప ఓట్ల మెజార్టీతో గెలుపొంది రెండో స్థానంలో ఉండగా, శ్రీసత్యసాయి జిల్లా మడకశిర టీడీపీ అభ్యర్థి ఎం.ఎస్.రాజు కేవలం 351 స్వల్ప ఓట్ల మెజార్టీతో గెలిచిన వారిలో మొదటి స్థానంలో నిలిచారు.

సీపీఐలో చేరిన ఇద్దరు కౌన్సిలర్లు, 100 కుటుంబాలు

రాజకీయాలకతీతంగా మన ప్రాంతాలను అభివృద్ధి చేసుకుందాం : ఎమ్మెల్యే కూనంనేని

విశాలాంధ్ర బ్యూరో-భద్రాద్రి కొత్తగూడెం: రాజకీయాలక తీతంగా అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షల మేరకు మన ప్రాంతాలను, కొత్తగూడెం నియోజకవర్గాన్ని బహుముఖంగా అభివృద్ధి చేసుకుందామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ప్రజల అవసరాలకనుగుణంగా నియోజకవర్గంలో ఇప్పటికే అభివృద్ధి పనులను వేగవంతం చేశానని ఒక్కొక్కటిగా ఆయన వివరించారు. కొత్తగూడెం మున్సిపాలిటీకి చెందిన 12, 19వ వార్డుల కౌన్సిలర్లు కూరపాటి విజయలక్ష్మి, బండి నరసింహతో పాటు 100 కుటుంబాలు కూనంనేని సమక్షంలో జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా సారథ్యంలో ఆదివారం సీపీఐలో చేరారు. సీపీఐ జిల్లా కార్యాలయం శేషగిరి భవన్‌లో ఈ సందర్భంగా సమావేశం నిర్వహించారు. సీపీఐలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి ఆత్మీయంగా ఆహ్వానించారు. పార్టీలో పని చేసే నాయకులు, కార్యకర్తలతో పాటు తమపై నమ్మకంతో పార్టీలో కొత్తగా చేరిన వారందరిని బాధ్యతగా, కంటికి రెప్పలా చూసుకుంటామని ఈ సందర్భంగా కూనంనేని, సాబీర్ పాషా స్పష్టం చేశారు. సీపీఐలో చేరిన కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు తమ తమ ప్రాంతాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. తమ ప్రాంతాల్లో ఏ సమస్యలున్నా నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే కోరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన కౌన్సిలర్లు విజయలక్ష్మి, నరసింహ మాట్లాడుతూ ఎలాంటి అవినీతి మచ్చలేని, నిరంతరం ప్రజల్లో ఉండి పనిచేసే నాయకుడు కూనంనేని అన్నారు. తమ ప్రాంతాలు అభివృద్ధి జరగాలంటే ఆయనతోనే సాధ్యమన్నారు. అందుకే సీపీఐలో మనస్ఫూర్తిగా చేరుతున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాస్, సలిగంటి శ్రీనివాస్, సింగరేణి యూనియన్ నాయకులు వంగ వెంకట్, రమణ మూర్తి, సీపీఐ వార్డు కౌన్సిలర్లు కంచర్ల జములయ్య, మునిగడప వెంకటేశ్వర్లు, భూక్య శ్రీనివాస్, యూసుఫ్ మాచర్ల శ్రీనివాస్, చారి, లగడపాటి రమేష్ చంద్ర, విజయ్, దుర్గా కళ్యాణి, సీపీఐ నాయకులు బత్తుల సురేష్, ఎం.ఎ.అజీజ్, నేరెళ్ల రమేష్, లగడపాటి రమేష్ చంద్ర, గుత్తుల శ్రీనివాస్, మిర్యాల రాము, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఫహీమ్, అస్లాం, గోపి, ఎరుకల రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీ రంగాకు కాంగ్రెస్ నివాళి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రైతుబిడ్డ, స్వాతంత్ర్య సమరయోధుడు డాక్టర్ ఎన్జీ రంగాకు కాంగ్రెస్ ఘన నివాళి అర్పించింది. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో రంగా చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజాజీవితంలో రంగా సేవలను కాంగ్రెస్ నేతలు గుర్తుచేసుకున్నారు. కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.గురునాథం, ఆర్‌టీఐ రాష్ట్ర చైర్మన్ పీవై కిరణ్, విజయవాడ నగర అధ్యక్షుడు నరహరశెట్టి నరసింహారావు, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.

సామాన్య కార్యకర్త నుంచి కేంద్రమంత్రి స్థాయికి...



నరసాపురం: ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ తరఫున నరసాపురం ఎంపీగా గెలిచిన భూపతిరాజు శ్రీనివాస వర్మకు మోదీ కేబినేట్‌లో అవకాశం వరించింది. ఈ మేరకు పీఎంవో నుంచి ఆయనకు సమాచారం వచ్చింది. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలపై 2.76 లక్షల ఓట్ల మెజార్టీతో శ్రీనివాస వర్మ భారీ విజయం సాధించారు. తెలుగుదేశం ఎంపీలు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్‌కు కేంద్రమంత్రి పదవులు లభించాయి. కాగా 1988లో బీజేపీ కార్యకర్తగా శ్రీనివాసవర్మ రాజకీయ జీవితం ప్రారంభించారు. 1992-95లో పశ్చిమ గోదావరి జిల్లా యువమోర్చా అధ్యక్షుడిగా పనిచేశారు. 2008 నుంచి 2014 వరకు రెండు పర్యాయాలు కమలం పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగారు. 2014లో భీమవరం పురపాలక వార్డు కౌన్సిలర్‌గా శ్రీనివాస వర్మ గెలుపొందారు. ఇన్‌చార్జి చైర్మన్‌గానూ ఆయన సేవలందించారు. తాజాగా నరసాపురం నుంచి ఎంపీగా విజయం సాధించారు. పశ్చిమ గోదావరి జిల్లాలో, రాష్ట్రంలో పార్టీ అభివృద్ధికి పాటు పడ్డారు. బీజేపీలో సామాన్య కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా ముందుండి సాయం చేస్తారనే పేరు ఆయనకు ఉంది. ఈ అంశాలను బీజేపీ అధిష్ఠానం పరిశీలనలోకి తీసుకొని శ్రీనివాసవర్మకు కేంద్రమంత్రిగా అవకాశం కల్పించింది. కేంద్రమంత్రివర్గంలో స్థానం లభించడంపై శ్రీనివాసవర్మ సంతోషం వెలిబుచ్చారు.

బాధ్యత పెరిగింది: శ్రీనివాస వర్మ

'కేంద్ర మంత్రివర్గంలో చోటు దక్కడం సంతోషంగా ఉంది. ప్రధానమంత్రి కార్యాలయం నుంచి నాకు ఉదయం ఫోన్ వచ్చింది. నాపై ఇప్పుడు మరింత బాధ్యత పెరిగింది. పార్టీలో కష్టపడి పనిచేసే కార్యకర్తకు అవకాశాలు ఉంటాయని చెప్పేందుకు నేను ఒక ఉదాహరణ. కేంద్రమంత్రిగా అవకాశం రావడం సంతోషకరం, ఇది ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న బీజేపీ కార్యకర్తలకు దక్కిన గౌరవం. నన్ను ప్రోత్సహించిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు. పార్టీ బలోపేతానికి మరింత కష్టపడతా. ఏపీ అభివృద్ధి కోసం పని చేస్తా. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏపీ వెనక్కి వెళ్లింది. ఏపీ బీజేపీ నేతలు, ప్రజలు నాకు ఈ విజయాన్ని ఇచ్చారు. సామాన్య కార్యకర్త అయిన నన్ను ఎంపీగా గెలిపించి కేంద్రమంత్రిని చేశారు' అని శ్రీనివాసవర్మ మీడియాతో చెప్పారు.

సాహితి

శ్రీశ్రీ భావ చైతన్యం

డా॥ రామసూరి

శ్రీశ్రీ గేయాలు లయాన్విత జీవన సత్యాలు. మానవ జీవితంలోని భిన్న దశలని కవితాత్మకంగా చిత్రించి, కళాత్మక జీవన సౌందర్యాన్నీ బీభత్సాన్నీ ఆవిష్కరించాడు శ్రీశ్రీ. శైశవం నుంచి వార్ధక్యం దాకా మనిషి బాధలకి కారణమైన సామాజిక స్థితిగతులని 1930-40 లలో కొత్త తరహాలో చెప్పడంతో, శ్రీశ్రీ ప్రజల చేత మహాకవిగా ఆదరణ పొందాడు.

ప్రపంచమొక పద్మవ్యూహం /కవిత్వమొక తీరనిదాహం

ప్రపంచంలో ప్రవేశించడం, విజయాన్ని సాధించి తిరిగి రాగలగడం రెండూ మనిషి సాధన చేయాలి. ఆ యుద్ధాన్ని చిత్రించడానికి శ్రీశ్రీ తన మనసులో ఎంత మథనం పొందాడో!

జగమంతా నిదుర మునిగి / సద్దణగిన నడి రాతిరి /నీలోనే నీవేదో ఆలకించుతావ్ /శ్రీనివాసరావ్! శ్రీనివాసరావ్!/ నడిరాతిరి కడలి వద్ద/ హోరుగాలి ఉపశ్రుతిగ / నీలోనే నీవేదో ఆలపించుతావ్/ అవ్యక్తపు టూహలతో ఆలపించుతావ్. విశాఖపట్టణం సముద్రపుటొడ్డున శ్రీశ్రీ హృదయస్పందనకి అక్షర రూపమిది.

ప్రథమ ప్రపంచ యుద్ధానంతర మానవ జీవనసంక్షోభాన్ని కవిత్వంలో చిత్రించడానికి కావలసిన భాష, లయ, ఛందస్సుని గురించి స్పష్టమైన విధానం పట్టుకున్నాడు శ్రీశ్రీ.

ఆధునిక జీవితాన్ని అధ్యయనం చేసినవాడే ఆధునిక కవిత్వాన్ని ఆహ్వానించగలడు. పరస్పరం సంఘర్షించిన/ శక్తులలో చరిత్రపుట్టెను. ఆధిపత్య ధోరణులు, మతోన్మాదం, యుద్ధాలూ ప్రజల జీవితంలో సృష్టించిన బీభత్సాన్ని కుదించి చెప్పడంలో ఉంది శ్రీశ్రీ నైపుణ్యం.

నీవు చూసే వెకిలిచూపూ/ నీవుతీసే కూనిరాగం/ మాకు తెలియని నీ ప్రపంచపు/ మహారణ్యపు చిక్కుదారులు.

ఆర్థిక సామాజిక, రాజకీయ కారణాలు యువకుణ్ణి మతిస్థిమితం కోల్పోయేలాచేసిన తీరు 'ఉన్మాది' కవితలో చిత్రించాడు. తెలివిమీరిన పెద్దమనుషులూ దురన్యాయం చేసిన బుద్ధిమంతులూ (ఇంటెలిక్చువల్స్) కారణమంటాడు శ్రీశ్రీ.

'సాహసి' కవితలో శ్రీశ్రీ భావాలు ఏ కాలంలోనైనా యువతని ఆలోచింపజేస్తాయి.

ఎగిరించకు లోహవిహంగాలని/ కదిలించకు సుప్త భుజంగాలని/ ఉండనీ మస్తిష్క కులాయంలో మనోవల్మీకంలో.

యుద్ధ విమానాలని ఎగరేయొద్దంటున్నాడు కవి, మానవుని హృదయంలో నిద్రపోయే పాములని లేపద్దం టున్నాడు కవి. అంతరాల భయంకర ప్రాంతాలనా నీ విహారం? ముళ్ల దారినా నీ సంచారం? యుద్ధాలనీ, మతోన్మాదాన్నీ రెచ్చకొట్టే రాజకీయ ప్రయోజనవాదులు యువకుల హృదయాలలో నిద్రపోయే పాములని కదిలించి, వారిని బలిచేసి తమ లక్ష్యాలని సాధించుకునే వారి పట్ల జాగ్రత్త వహించమంటున్నాడు కవి.

పలికించకు మౌన మృదంగాలను/ కెదలించకు శాంత తరంగాలను/ హృదయంలో దీపం పెట్టకు/ మంత్ర నగరి సరిహద్దులు ముట్టకు.

శ్రీకాకుళం ప్రాంతంలో 'దీపం పెట్టు' అనే మాట తిట్టు. దీపం వెలిగించటం వేరు. దీపం పెట్టటం వేరు. శ్రీశ్రీ శబ్ద సంస్కారం ఇలాంటి సందర్భంలో మిరుమిట్లు గొల్పుతుంది. 'హృదయంలో దీపం పెట్టకు' ఈ కవితకి తాళం చెవి. ఈ వాక్యం ఆధారంగానే కవి హృదయాన్ని మనం పట్టుకోవచ్చు. ఈ కవితకి 'సాహసి' శీర్షిక. స్వార్థపరుల ప్రయోజనాల కోసం ప్రదర్శించే సాహసం దుస్సాహసం అవుతుందనేది అంతరార్థం.

కవితా! కవితా!/ నా యువకాశల నవ పేశల/ సుమ గీతావరణం. యువకుల ఆశలని ఆవేశంతో పలికిన కొత్తకోయిల శ్రీశ్రీ.

అవిగో, అవిగవిగో! అవిగవిగో!/ ఇంకొన తెగిపోయిన మరణించిన/ క్రొన్నెత్తురు! విపంచికలు! యువ యోధులు/

లాలాలజపతిరాయ్ వంటి దేశ భక్తుడు బ్రిటీష్ వారి లాఠీ దెబ్బలకి బలైతే, ఆ ఉద్యమం అగ్నిలోంచి వికసించిన వజ్రం భగత్‌సింగ్, అటవీ సంపద సృష్టించే గిరిజనులకోసం పోరాటంచేసిన అల్లూరి సీతారామ రాజు వంటి యువ యోధులని కీర్తిస్తూ అభ్యుదయ కవితకి స్ఫూర్తి నిచ్చిన కవి శ్రీశ్రీ.

'అవతారం' కవితలో శ్రీశ్రీ ఆహారోత్పత్తికి మానవుడు నిరంతరం పడిన మథనం చిత్రించాడు. వరాహావతారం ధాన్యం ఉత్పత్తిలో కీలక పాత్ర పోషించింది. పంది తన కోరలతో భూమిని పెళ్లగించి దుంపలు తినడం చూసిన మనిషి నాగలితో భూమి దున్నడం నేర్చుకున్నాడు. అలా దున్నిన నేలలోపండిన ధాన్యం బలంగా ఉండటం గమనించాడు. మానవుని మేధో పరిణామం 'అవతారం' కవితలో కనిపిస్తుంది.

ఆది సూకర వేద వేద్యుడు/ ఘుర్ఘురిస్తూ/ కోర సాచాడు/ పుడమి తల్లికి/ పురుటి నొప్పులు/ కొత్త సృష్టిని స్ఫురించాయి.

సామాజిక పరిణామంలో మానవుని అభ్యుదయాన్ని 'పుడమితల్లికి పురుటి నొప్పులు' అనడంలో స్ఫురింపజేశాడు శ్రీశ్రీ. అంతేకాదు. పుడమికి పుట్టినరోజు జరిపించిన కవి కూడా శ్రీశ్రీయే. 'జ్వాలాతోరణం' కవితలో

ప్రదీప్తకీలా ప్రవాళ మాలా / ప్రపంచవేలా ప్రసారములలో/ మిహిర వాజితతి మఘవధనుర్ద్యుతి/ పుడమికి నేడే పుట్టినరోజట. ప్రపంచం పొడుగునా జరిగిన విముక్తి పోరాటాలని 'జ్వాలాతోరణం'గా ఊహించాడు. ఉద్యమాల అంతస్సారం, అంతర్జాతీయ దృక్పథం ఈ కవితలో వ్యక్తం చేశాడు. పుడమిని కాపాడుకుంటేనే పుట్టినరోజు జరుపుకోగలుగుతాం.

విచక్షణ తెలిసిన విలక్షణ కవి శ్రీశ్రీ. 'నగరంలో వృషభం' అనే కవితలో మనిషి హృదయానికీ మెదడుకీ సంఘర్షణ చిత్రించాడు. వ్యవసాయ ఉత్పత్తికి ప్రధానమైన ఎద్దు పల్లె పట్టులని వదిలి నగరానికి రావటం ఈ కవితలో వస్తువు. సంస్కృతికి సంకేతం ఎద్దు. నాగరకతకి సంకేతం ట్రాక్టర్. యంత్ర సంస్కృతికీ మానవ సంస్కృతికీ దూరం పెరిగిపోవటం పట్ల శ్రీశ్రీ ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు.

కదలకుండా మెదలకుండా/ నగరం హృదయంలో వృషభం. 'హృదయం' అనే పదం ఈ కవితకి తాళం చెవి. దీని ఆధారంగా కవితని అర్థం చేసుకునే ప్రయత్నం చెయ్యాలి.

పరిత్యజించి కాలానికి బాధ్యత/ పరిహసించి నాగరికత పరుగు. పల్లెపట్టుల ఆకుపచ్చని సంస్కృతిని మరచి, ప్లాస్టిక్ మోజులో పడ్డ నగరాలని నిలదీస్తున్నాడు శ్రీశ్రీ.

రైతుతో సమానంగా ఆరుగాల జీవితమంతా పొలంలో కష్టపడి ప్రజలకి తిండిపెట్టే శక్తి సన్నగిల్లిన సమయంలో ఎద్దని వదిలేసే రాక్షసత్వాన్ని ప్రశ్నిస్తున్నాడు శ్రీశ్రీ. ఎద్దుకి లేకపోతే బుద్ధి/ మనిషికేనా ఉండొద్దా? అంటాడు. అలాంటి వృషభాలని జీవించినంత కాలం మనిషే సంరక్షించాలంటాడు కవి. పల్లెలూ అడవులూ కాపాడుకోనంత కాలమూ పులులూ, సింహాలూ అన్నీ నగరాలలో ప్రవేశిస్తాయన్న హెచ్చరిక ఆనాడే చేశాడు క్రాంతదర్శి శ్రీశ్రీ.

బాంబుల వర్షాలు వెలిసిపోయాక/ బాకుల నాట్యాలు అలసిసోయాక/ గడ్డిపువ్వులు హేళనగా నవ్వుతాయి/ గాలి జాలిగా నిశ్వసిస్తుంది/ ఖడ్గాన్ని రద్దు చేస్తుంది ఖడ్గం/ సైన్యాన్ని తినేస్తుంది సైన్యం/ పొలంలో హలంతో రైతు/ నిలుస్తాడివాళా రేపూ.

యుద్ధాలూ మతోన్మాదమూ ఎంతగా కన్నెర్ర చేసి, మానవ వికాసాన్నీ పసిపిల్లల పెదవుల దరహాసాన్నీ కబళించాలని చూసే ఆయుధ సంస్కృతి నాగలితో నిలబడ్డ రైతుల మానవ సంస్కృతి ముందు దిగదుడుపేనని శ్రీశ్రీ హృదంతరాళం గర్జిస్తుంది.

భాషని బతికించేది శ్రీశ్రీ లాంటి కవులే. మనం మాట్లాకునే మాటని లయాన్వితంగా పలికించి, నోటికి పట్టే ఛందస్సులతో గేయాలు రచించిన కవి శ్రీశ్రీ. తన కాలం నాటి ప్రాపంచిక స్థితిగతుల పట్ల అవగాహనతో తన హృదయం ఎలా స్పందిస్తే అలా తగిన మాటలని లయాన్వితంగా పరుగులు తీయించి, మాత్రా ఛందస్సులతో తెలుగు భాషని ఆధునిక భావ చైతన్యానికి అనుకూలంగా మలచిన కవి శ్రీశ్రీ.

అర్థం చేసుకున్న జీవితం, చదివిన చదువూ సమన్వయం కుదిరినప్పుడే శ్రీశ్రీలాంటి కవి పుట్టుకొస్తాడు. సంక్లిష్ట పరిస్థితులని తట్టుకొని నిలబడిన కవి శ్రీశ్రీ. రెండు ప్రపంచ యుద్ధాలు, వైజ్ఞానిక పురోగమనం మనిషిని మరచి యంత్ర భూతముల కోరలు తోముతున్న సమయంలో వ్యవసాయానికి ఆధారమైన రైతునీ, వస్తూత్పత్తికి ఆధారమైన కార్మికుణ్ణి ఉత్తేజపరిచిన కవి శ్రీశ్రీ. 'శరీర పరీవృతుడా' అని మానవుని హృదయాన్ని పరిమళింపజేసిన కవి శ్రీశ్రీ.

ప్రపంచమొక కుగ్రామమవుతుంది/ జీవితమిక సంగ్రామమవుతుంది. అని ముందుగానే చెప్పిన శ్రీశ్రీ ఎప్పటికప్పుడు కొత్త తరాలని కదిలించే కవిగా సాహిత్య చరిత్రలో ప్రజల చేత కీర్తింపబడిన 'మహాకవిగా' శ్రీశ్రీ నిత్య చైతన్యశీలి.

ఊరకుక్కలు!

ఏ వీథిలో చూసినా కనిపిస్తాయ్ తిరుగుబోతు ఊరకుక్కలు!
అడుక్కోవడంలోని ఆనందమే వాటికి దక్కిన నజరానా
కాలం నుంచి సంక్రమించే తిట్లూశాపనార్థాలే వాటికి దక్కిన ఆస్తిపాస్తులు
లోకంనుంచి దక్కే చివాట్లూ చెప్పుదెబ్బలే వాటికి మిగిలే సిరిసంపదలు

రాత్రి పూట నిశ్చింతగా నిద్రపోనూ లేవు
పొద్దున్నే ప్రశాంతంగా లేవనూ లేవు!
చెత్తకుండీలే వాటి నివాసాలు-మురికి గుంటలే వాటి ఆవాసాలు
పొరబాట్న ఈ ఊరకుక్కలెప్పుడైనా తిరగబడితే,
చిన్న రొట్టెముక్క వాటి ముందు పారెయ్!
బస్, ఇంక వాటిల్లో అవే కొట్లాడుకుంటాయ్ కాట్లాడుకుంటాయ్!

ప్రతివాడూ ఈ ఊరకుక్కల్ని కళ్ళుమూసి జెల్లకొట్టేవాడే!
పేదరికంతో విసిగివేసారి, పాపం, ఈ కుక్కలెప్పుడో కునికేస్తాయ్!!
కానీ
ఈ పీడిత జీవులెన్నడైనా తిరగబడి తలెత్తాయే అనుకో,
తిరుగుబాట్ల చరిత్ర ఆ రోజునే తిరగబడుతుంది!
తమకు జరుగుతున్న అవమానాన్ని ఈ ఊరకుక్కలకెవరైనా విప్పిచెప్పిన నాడు-
బద్ధకంగా ఊగే వాటి తోకల్లో చైతన్యం నింపిన రోజు-
ఇవే ఊరకుక్కలు సకల లోకాలనూ సొంతం చేసుకోగలవు!
తమ ఏలికల ఎముకల్ని అవి ఏరిపారేయనూ గలవు!
తస్మాత్ జాగ్రత, జాగ్రత!!

మందలపర్తి కిశోర్, 81796 91822

త్యాగధనుడు

-ఎస్.ఆర్.పృథ్వి, 9989423245

నాన్నంటే అమ్మ మదిలో నమ్మకం
వెన్నతో గూడు కట్టుకున్న ఆత్మ విశ్వాసం
ఆమె జీవనరేఖలో అర్ధభాగం
పొలంపండి, గింజదిగుబడై ధాన్యం ఇంటికి చేరినపుడు
రైతుకెంత సంబరమో
బిడ్డఎదిగి, వాడి కాళ్లమీద
నిలిచినప్పుడు అంతే ఆనందం తండ్రికి
బిడ్డలు వేసే బుడిబుడి అడుగుల్లో
భవిష్యత్తును చూడగల్గిన స్ఫురద్రూపి నాన్న
తన జీవిత క్షణాల మాధుర్యాన్ని
పిల్లల బతుకులపై తేనెలాగ పూస్తాడు
భార్యాబిడ్డల వెన్నంటే ఉండి, వాళ్లకి
ఆత్మ స్థైర్యపు ప్రాణవాయువు అవుతాడు
అప్పులు మదిలో కలవరపెడుతున్నా
ఆ ఛాయలు, ఇంటి వాకిటిలోకైనా రానీయడు
ఎదిగిన కుటుంబ మహావృక్షానికి
భూమిలో ఉండి, కనిపించని వేరు నాన్న

ఎంత చెట్టుకు అంతే గాలని తెలిసినా
బిడ్డల జీవన పుష్పాలు వికసించాలన్న
తపన, కళ్లల్లో ఆశాచిత్రాలుచేసి
పదిలంగా నిలుపుకుంటాడు
వాళ్లకి అలసట అంటకూడదని, తాను
నిత్యం, శ్రమ స్వేదంలో స్నానం చేస్తాడు

ఫలాలను కుటుంబసభ్యుల నోటి కందించి
ప్రతిఫల మాశించని చెట్టులా మిగిలిపోతాడు
సంసార సాగరంలో కొట్టుకుపోతున్నా
కుటుంబాన్ని నేర్పుగా తీరాన్ని చేర్చే
దృఢ సంకల్పమున్న పడవ నాన్న
జీవన ప్రయాణంలోకి కష్టాలు
చాప కింద నీరులాగ ప్రవహించినా
ధైర్యాన్ని కవచంగా ధరిస్తాడు
పిల్లల బతుకు చిత్రాలకు
అందమైన రంగులు వేసే 'కుంచె' నాన్న
తను అడుసులో మన్నులా మిగిలిపోయినా,
పిల్లల జీవితాలు పచ్చగ పరిమళించాలని
నిరంతరం శ్వాసతో పోరాడతాడు
ఓపిక సన్నగిల్లాక, ఒంటరితనాన్ని
శిరస్సుపై మోస్తున్నా సరే, బిడ్డలను
తప్పు పట్టని త్యాగధనుడు నాన్న!

(జూన్ 16 అంతర్జాతీయ తండ్రుల దినోత్సవం సందర్భంగా)

ఈస్థటిక్స్ -2024 పురస్కారాలకు ఆహ్వానం

ఈస్థటిక్స్ పేరిట ప్రతి యేటా ఒక ఉత్తమ కవితా సంపుటికి, మూడు ఉత్తమ కథలకు ఇచ్చే పురస్కారాలకు ఈస్థటిక్స్ ఆహ్వానం పలుకుతోంది. మూడు ఉత్తమకథలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ పురస్కారాలు, అలాగే మరికొన్ని కథలను సాధారణ ప్రచురణకు ఎంపిక చేసి ఒక పుస్తకంగా ప్రింట్ చేయడం జరుగుతుంది. మూడు ఉత్తమ కథలకు మొదటి బహుమతిగా రూ. 25వేలు, రెండవ బహుమతిగా రూ.15వేలు, మూడవబహుమతిగా రూ.10వేలు అందచేస్తారు. ఉత్తమకవితాసంపుటికి రూ.40వేలు నగదు బహుమతిగా అందజేస్తారు. విజేతలకు నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం, సత్కారం చేస్తారు. ఈ అవార్డుల కమిటీకి ఓల్గా, ఎల్లెస్సార్ ప్రసాద్ గౌరవ సలహా దారులుగా వ్యవహరిస్తారు. ఖమ్మం ఈస్థటిక్స్‌సభ్యులుగా ప్రసేన్, సీతారాం,మువ్వ శ్రీనివాసరావ్, రవిమారుత్, ఫణి మాధవి, వంశీ కృష్ణ, పగిడిపల్లి వెంకటేశ్వర్లు వ్యవహరిస్తారు. కవితా సంపుటి 2023 ఏప్రిల్, 2024 మార్చి మధ్య ప్రచురితమై ఉండాలి. సంపుటి కనీసం 25కవితలకు తగ్గకుండా ఉండాలి. పురస్కారం కోసం కవితాసంపుటికి నాలుగుప్రతులను పంపాల్సి ఉంటుంది. ఆగస్టు 31లోపు ఈ అవార్డులకు కథలు, కవితా సంపుటులు పంపాలి. **కవితా సంపుటులు, కథలు పంపాల్సిన చిరునామా. ఈస్థటిక్స్ సాహిత్య పురస్కారాలు, ఖమ్మం ఈస్థటిక్స్ హార్వెస్ట్ స్కూల్, డోర్ నెం.5-7-200/11, పకబండ బజార్, ఖమ్మం -507002, ఫోన్ నెం9849114369,**

Khammamaesthetics@gmail.com**కు పంపించండి.**

గుండె గుండెకు హాస్యం,వ్యంగ్యం పంచిన కథలు

ప్రొ. సి.హెచ్. సుశీలమ్మ

గ్రంథ సమీక్ష

ఈ చరాచర సృష్టిలో మానవుడికి మాత్రమే నవ్వే శక్తి ఉంది. ఆదిమ మానవుడు కూడా నవ్వును తన అనుభూతికి అందిన విధంగా అనుభవించి ఉంటాడు. నిజానికి నవ్వించడానికి ఎంతో ప్రతిభ కావాలి. నవ్వడానికి మరెంతో రసికత కావాలి. కావ్యాల్లో రస ప్రసక్తి వచ్చినప్పుడు "శృంగారం తర్వాత హాస్యానికి" స్థానం ఇచ్చారు మన అలంకారికులు. ఇరవయ్యో శతాబ్ది ప్రారంభంలో ఆధునిక సాహిత్యంలో ఆంగ్ల సాహిత్య ప్రభావం వల్ల గతంలో ఎరుగని భావ స్రవంతులు ప్రవహించి నూతన సాహితీ సృష్టి జరిగింది. కందుకూరి, గురజాడ, చిలకమర్తి, పానుగంటి, మునిమాణిక్యం, మొక్కపాటి నుండి ఇటీవలి ఆదివిష్ణు, ఎర్రంశెట్టి శాయి, ముళ్లపూడి, జంధ్యాల, శ్రీరమణ హాస్య రచనలు చేశారు. కడుపుబ్బ నవ్వించారు.

ఈ ఉపోద్ఘాతం ఎందుకంటే వల్లూరు శివప్రసాద్ కథలు 'గడప గడపకు' చదువుతున్నప్పుడు చాలా చోట్ల ఆ రచనా విధానం చూస్తే ఇవి కేవలం హాస్య రచనలు అనడం అన్యాయం అనిపిస్తుంది. విషాదంలో హాస్యాన్ని, హాస్యంలో విషాదాన్ని చిత్రించే అద్భుతమైన రచనా నైపుణ్యం ఆయనది. అక్కడక్కడ నవ్వు తెప్పించే సంఘటనలు, సంభాషణలు ఉన్నాయి. నవ్వు వస్తుంది కానీ ఆ వెనుక ఉన్న మధ్య తరగతి మానవుడి జీవితపు పెనుగులాట, డబ్బు ఇబ్బందులు, అరాచకంగా మారిపోతున్న వ్యవస్థ నలిగిపోతున్న నిస్సహాయతకన్పిస్తుంది. మరీ ముఖ్యంగా ఇందులోని 12 కథల్లో 6 కథలు సామాన్యుడు ప్రయాణ సాధనాలుగా ఉపయోగించే 'సైకిల్, స్కూటర్, బస్, స్కూల్‌బస్, సిటీబస్సు' లకు సంబంధించే కథలు.

డొక్కు సైకిల్‌తో జీవితాన్ని లాగిన ఫోర్త్ క్లాస్ ఎంప్లాయి ఇంటి బైట పెట్టిన సైకిల్ పోయినందుకు ఎక్కువ బాధపడక లోన్‌పెట్టి కొత్తసైకిల్ కొనుక్కున్నాడు. ఒన్ ఫైన్ మార్నింగ్ పోలీసులు ఇంటికొచ్చి 'ఒక దొంగ కొట్టేసిన చాలా సైకిల్స్ దొరికాయని, స్టేషన్ కొచ్చి "ఫార్మాలిటీస్" పూర్తిచేసి సైకిల్ తీసుకెళ్లమంటారు. వాళ్లు రాగానే వరదయ్య భార్య "ఎవరండీ వాళ్లు, దొంగల్లా ఉన్నారు. పోలీసుల్ని పిలవండి" అంటే "వచ్చింది వాళ్లేనే" అనే చెణుకు విసిరారు రచయిత. ఇక అప్పటి నుండి అతనికి అవస్థలు మొదలయ్యాయి. రోజూ పోలీస్ స్టేషన్‌కీ, కోర్టుకీ తిరగడం, లీవులు పెట్టి ఆఫీసర్ చేత చీవాట్లు తినడం, సైకిల్‌ని హాజరుపరచాలి కాబట్టి ఆ డొక్కు సైకిల్ తొక్కితొక్కి నడుము కాళ్లు నొప్పులు, డాక్టర్ ఫీజులు... చివరకు ఓ రాత్రిఎవరూ లేని సమయం చూసి హుస్సేన్‌సాగర్‌లో ఆ సైకిల్‌ని పారేసి ఊపిరి పీల్చుకున్నాడు. కానీ రెండేళ్ల తర్వాత "నీటి కాలుష్య నివారణలో భాగంగా ప్రపంచ బ్యాంకు సహాయంతో హుస్సేన్‌సాగర్ ప్రక్షాళన చేపట్టబో తోందని" తెలిసి అతని గుండెల్లో రాయి పడింది. కానీ ఆ ప్రక్షాళన జరగబోదని రచయితకు, మనకూ తెలుసు.

పొగబండ్లు ఒక మంచికథ. బస్సులో పొగ తాగ రాదు అని రాసి ఉంటుంది కానీ అందరూ ముఖ్యంగా డ్రైవర్ కండక్టర్‌లు కూడా సిగరెట్లు తాగడం మనం చూస్తుంటాం. ఒక సందర్భంలో డ్రైవర్‌సిగరెట్ తాగడం చూసి ప్రయాణికులు కూడా వెలిగించారు నిరభ్యం తరంగా. అప్పుడు ఒకతను చుట్ట తీసి వెలిగించాడు. గుప్పు గుప్పున వదులుతున్న ఆ పొగకి ప్రయాణికులతో పాటు డ్రైవర్ కూడా చిరాకు వచ్చి, బస్సు ఆపి వచ్చి చుట్ట ఆర్పేయమన్నందుకు 'మీరు సిగరెట్ తాగితే లేదు గానీ నేను చుట్ట తాగితే తప్పా' అని వాదిస్తాడు. చివరికి డ్రైవర్‌తో పాటు ప్రయాణికులు సిగరెట్స్ బయట పారేస్తారు. చివరిలో రచయిత ప్రత్యేకత ఏమిటంటే "అతనికి చుట్ట అలవాటు లేదు. చిల్లర లేదని నోటు మారుస్తూ తాత కోసం చుట్ట, అగ్గిపెట్టె కొన్నానని, డ్రైవర్‌కి బుద్ధి చెప్పడానికి తాగానని" చెప్పడం మంచి కొసమెరుపు.

నిబద్ధత, నిజాయితీ లేని ఒక అవకాశవాది అయిన మైకాసురుని కథ-దేవుడు లేడని ఒకసభలో అద్భుతంగా ఉపన్యాసం ఇచ్చి చప్పట్లు కొట్టించుకుని, మరో సభలో దేవుడున్నాడు అని చెప్పి ప్రేక్షకుల చేత చప్పట్ల వర్షం కురిపించుకోవడం పై ఒక వ్యంగ్య బాణం విసిరారు శివప్రసాద్. 'ప్రజల ప్రాణాల సంరక్షణ తమ బాధ్యత' అంటూ హెల్మెట్స్ పెట్టుకోవడం కంపల్సరీ చేసిన అధికారులు, పెళ్లిరోజున ఫ్రెండ్ హెల్మెట్ తెచ్చి భార్యకు ఇవ్వడం, సినిమా హాలులో మర్చిపోవడం, దారిలో పోలీసులు దబాయింపుతో వెదికే పనిలో అటూ ఇటూ తిరిగి హైరానాపడి, పెళ్లిరోజు ఆనందం ఆవిరైపోవడం, ఒక సగటు జీవి తంటాలు పడడంలో హాస్యం కంటే సగటు జీవి ఆవేదనే మనకు కనిపిస్తుంది.

పెళ్లి సంబడం కథలో సిటీబస్‌లో మారి మారి ఒక పెళ్లికి వెళ్లడం, పాత కాలపు ప్రేమలు, ఆప్యాయత పలకరింపులు లేక, బ్యాండ్ మేళాల హోరు, ఫొటోగ్రాఫర్ హడావుడి, బఫే డిన్నర్‌లో నిలబడి తినడం, వడ్డింపు భోజనాల దగ్గర తినేవాళ్లు ఎప్పుడు లేస్తారా అని వాళ్ల వెనక గుంపులుగా నిలబడ్డ జనం...నేటి ఆడంబరపు పెళ్లిళ్ల తంతుకి నిదర్శనం.

ఒక ఆహార ప్రియుడైన వ్యక్తి మంచి భోజనానికి మోహం వాచిపోవడం, తీరా ఫ్రెండ్ ఇంట్లో ఎన్నో పదార్థాలు వడ్డించగా అవి తను కాశీలో వదిలేసినవి అవడంతో ఉసూరుమనడం అహ్హాహ్హా భోజనం కథ. కాశీలో ఇష్టమైనది వదిలేయడం అంటే- మనిషికి ఇష్టమైనది ఏది? "నేను" అనే తపన, తాపత్రయం, లేదా "అహం". అది వదిలేయాలి కానీ వంకాయ, మామిడిపండు కాదు.

నేను నువ్వుగా, నువ్వు నేనుగా- ఒక స్త్రీ వాద ధోరణి కథ. రోజూ టైంకి అన్నీ అమర్చి పెట్టే భార్య శ్రమ విలువను గుర్తించని భర్త ఒక్కరోజు ఆమె స్థానంలో తను ఉంటే, ఆమె చేసే కష్టం తెలిసి బుద్ధి వస్తుంది. గడప గడపకు టైటిల్ కథ ఈ మధ్య చాలామంది ఎదుర్కొన్న స్మార్ట్‌ఫోన్ సమస్య. ఎవరో ఏదో మెసేజ్ పంపిస్తే కనీసం చదవనైనా చదవకుండా ఫార్వాడ్ చేయడం, ఒకవేళ అది ప్రభుత్వ వ్యతిరేకమైనది అయితే పోలీసుస్టేషన్‌కు వెళ్లి, మిత్రులందరినీ పిలిచి, తన మంచితనాన్ని నిరూపించుకోవడానికి పడే తిప్పలు తెలిపే కథ.

నాట్ మ్యాచ్ కథలో చెప్పినట్లు ఆఫీస్ రిజిస్టర్‌లో సంతకం కాకుండా "తంబ్ లేదా ఫేస్ ఐడి" వల్ల ఎందరో పడిన బాధలు ఈమధ్య వింటున్నాం. మిషన్‌కేం తెలుసు గుండు కొట్టించుకుని వచ్చిన మనిషిని గుర్తించడం! విద్యారంగంలో బోధనేతర పనులతో నిత్యం సతమతమవుతున్న ఉపాధ్యాయుల దైన్యస్థితికి అద్దం పట్టిన కథ ఇది.

స్మార్ట్‌ఫోన్‌లో ఒ.టి.పి ఎవరికైనా చెబితే క్షణాల్లో మన డబ్బు మాయమయ్యే మోసాలు గురించిన కథ, 'తిండి కలిగితే'...లో మధ్య తరగతి జీతగాడు అనేక ఆశల్ని చంపుకోవడం, ఖర్చులను సర్దుకోవడం, మేకవన్నె లాంటి రాజకీయ పులులు, వారి అనుయాయుల జులుం కథలు, తమకు అన్నీ తెలుసుననుకుని టాబ్లెట్లు తెచ్చి వేసుకుని ప్రాణాల మీదికి తెచ్చుకునే వారి ఉదంతం కథలు బాగున్నాయి.

నాటక రచయిత కాబట్టి సన్నివేశాలను, సంభాషణలు కళ్ల ముందు దృశ్యాలు దృశ్యాలుగా ప్రత్యక్షం చేశారు వల్లూరు శివప్రసాద్. ఈ పుస్తకాన్ని అభ్యుదయ రచయితల సంఘం ప్రచురించింది.

"చార్లీ చాప్లిన్" చిత్రాలు చూస్తే నవ్వు వస్తుంది. కానీ అతని బక్క ఆకారం వెనుక ఉన్న న్యూనత, డ్రస్, బూట్లు మంచివి కొనుక్కోలేకపోయిన ఆర్థిక స్థితి, అతని పాట్లు చూసి పక్కవాళ్లు నవ్వుతుంటే అతని గుండెలో ముసురుకునే ఆవేదన, గూడు కట్టుకునే విషాదం ఎందరు గుర్తించగలరు! వల్లూరు శివప్రసాద్ "గడప గడపకు" కథల్లో పాత్రలన్నీ మధ్య తరగతి, దిగువ మధ్య తరగతికి చెందినవే. వారి ఇబ్బందులు తెలియజేసే కథలే. అందుకే ఈ కథల్లో "విషాద హాస్యం" గోచరిస్తుందని చెప్పవచ్చు.

'నరేంద్ర విధ్వంసక కూటమి'

- నితీశ్, చంద్రబాబుతో కలిసి గట్టెక్కారు
- వ్యక్తిగతంగా, నైతికంగా అతనిది భారీ ఓటమి
- మోదీపై కాంగ్రెస్ ధ్వజం

న్యూఢిల్లీ : నరేంద్ర మోదీపై కాంగ్రెస్ పార్టీ ఆదివారం విరుచుకుపడింది. ఆయనకు అన్ని చట్టబద్ధత లేకపోయినా 'నరేంద్ర విధ్వంసక కూటమి (ఎన్‌డీఏ) నాయకుడిగా' ఈ సాయంత్రం ప్రమాణ స్వీకారం చేస్తారని అన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ మాట్లాడుతూ 'మే 28, 2023 గుర్తుందా? నరేంద్ర మోదీ రాజదండంతో కొత్త పార్లమెంటు భవనంలోకి అడుగుపెట్టిన రోజు. దీనికోసం ఆగస్టు 15, 1947 చరిత్రను 'మోదీ సామ్రాట్‌గా వ్యవహరించడాన్ని సమర్థించడమే కాదు. కానీ తమిళ ఓటర్లను ఆకర్షించడానికి కూడా' అని తెలిపారు. 'ఆ రోజే నేను పురావస్తువును ఉపయోగించి మోదీ నకిలీని బయటపెట్టాను' అని అన్నారు. 'ఆ నాటకం ఫలితం ఇప్పుడు మనకు తెలిసిపోయింది. రాజదండం తమిళ చరిత్రకు గౌరవప్రదమైన చిహ్నంగా మిగిలిపోయింది. అయితే తమిళ ఓటర్లు, వాస్తవానికి భారతదేశ ఓటర్లు మోదీ వేషాలను తిరస్కరించారు' అని అన్నారు. మోదీ వ్యక్తిగతంగా, రాజకీయంగా, నైతికంగా భారీ ఓటమిని చవిచూశారని కాంగ్రెస్ నేత పేర్కొన్నారు. గత పదేళ్లలో తాను తుంగలో తొక్కిన రాజ్యాంగానికి మోదీ తలవంచాల్సి వచ్చిందని జైరాం రమేశ్ అన్నారు. 'విపరీతంగా క్షీణించిన 'మూడవ వంతు' ప్రధాన మంత్రి, ఇప్పుడు అన్ని విధాలా చట్టబద్ధత లేకుండా ఆదివారం సాయంత్రం నరేంద్ర విధ్వంసక కూటమి (ఎన్‌డీఏ) నాయకుడిగా ప్రమాణ స్వీకారం చేయగలిగారు' అని ఆయన చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జేడీయూ అధినేత నితీశ్ కుమార్ మద్దతు లేకుండా మోదీ మూడోసారి ప్రధాని అయ్యేవారు కాదని, ఇప్పుడు 240 సీట్లతో ప్రధాని అయ్యారని కాంగ్రెస్ నేత అభిప్రాయం వ్యక్తం చేశారు. 'ఆయన ఏదోవిధంగా తన మిత్రులను పొందగలిగాడు. బీజేపీ ఎంపీలు కూడా ఆయనను బీజేపీ పార్లమెంటరీ పార్టీ నేతగా ఎన్నుకోలేదు. ఎన్‌డీఏ కూటమికి అధిపతిగా తనను తాను అభిషేకించుకున్నారు. ఆపై పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో ఎన్‌డీఏ ఎంపీల సమావేశాన్ని నిర్వహించారు' అని తెలిపారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూతో పోల్చుతూ, 'నెహ్రూ మూడింట రెండొంతుల మెజారిటీతో వరుసగా మూడుసార్లు ప్రధానమంత్రి అయ్యారు. ఆయన ప్రజాస్వామ్యవాదిగా మిగిలిపోయాడు. మోదీ తనంతట తానుగా 270 కూడా రాకుండా ప్రధాని కాబోతున్నాడు' అని అన్నారు. ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి అతిథి జాబితాపై మోదీపై ధ్వజమెత్తిన జైరాం రమేశ్... 'సరే, ఇప్పుడు స్వీయ-శైలి విశ్వగురు అంతర్జాతీయ నాయకులను పొందడానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరు కావడం ఏమిటి? ఎందుకంటే నరేంద్ర మోదీకి చట్టబద్ధత లేదు' అని తెలిపారు. 'ఇది చట్టవిరుద్ధమైన ప్రభుత్వం. ఇది డబ్బు శక్తి, సంస్థలు, మీడియా, భయం, బెదిరింపులను ఉపయోగించింది. ఇది ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికయిన ప్రభుత్వంగా నేను చూడను. ఎందుకంటే ప్రజల తీర్పు మోదీకి లేదు' అని అన్నారు. 'ఎక్స్' లో మరో పోస్ట్‌లో, జైరాం రమేశ్ ఆదివారం ఉదయం రాజ్‌ఘాట్‌ను సందర్శించడంపై మోదీపై విరుచుకుపడ్డారు. 'మీ ట్రాక్ రికార్డు చూడండి : ఆయన సైద్ధాంతిక సోదరభావం శత్రుత్వం, ద్వేషం విషపూరిత వాతావరణాన్ని సృష్టించింది. ఫలితంగా జనవరి 30, 1948న మహాత్ముని హత్యకు దారితీసింది' అని పేర్కొన్నారు.

'నాథూరామ్ గాడ్సేను హీరోని చేసే తన సహచరులను ఆయన (మోదీ) ఎప్పుడూ పైకి లాగరు. పార్లమెంటు హౌస్‌లోని మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఒకసారి కాదు రెండుసార్లు స్థానభ్రంశం చేశాడు' అని తెలిపారు. 1982లో అటెన్‌బరో చిత్రం రాకముందు మహాత్మా గాంధీ గురించి ప్రపంచానికి తెలియదని ఆయన (మోదీ) తప్పుడు ప్రచారం చేశారు. వారణాసి, అహ్మదాబాద్, ఇతర ప్రాంతాలలో గాంధేయ సంస్థలను కూల్చివేసి, ధ్వంసం చేశాడు. ఊపిరి పీల్చుకునే కపటత్వం!' అని జైరాం రమేశ్ అన్నారు.

స్మృతి, అనురాగ్, రాణేలకు మొండిచేయి

న్యూఢిల్లీ: బీజేపీ నేతలు, కేంద్ర మాజీ మంత్రులు స్మృతి ఇరానీ, అనురాగ్ ఠాకూర్, నారాయణ్ రాణే మోదీ 3.0 కేబినెట్‌లో చోటు దక్కలేదు. స్మృతి ఇరానీ, లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ నుంచి కాంగ్రెస్ విధేయుడు కిషోరీలాల్ శర్మ చేతిలో 1.6 లక్షల ఓట్ల తేడాతో ఓడిపోయారు. మోదీ.2 కేబినెట్‌లో మహిళా శిశు అభివృద్ధి శాఖ మంత్రిగా పనిచేశారు. ఆమె ఐదేళ్ల క్రితం కాంగ్రెస్ అగ్రనేత చెందిన రాహుల్ గాంధీని అమేథీలో ఓడించారు. ఇక మోదీ 2.0లో క్రీడలు, సమాచారశాఖ మంత్రిగా పనిచేసిన అనురాగ్ ఠాగూర్... హిమాచల్ ప్రదేశ్‌లోని హమీర్‌పూర్ నుండి గెలిచారు. నారాయణ్‌రాణే... క్రీడలు, సమాచార ప్రసార శాఖలను నిర్వహించారు. రాణే మహారాష్ట్రలోని రత్నగిరి-సింధుదుర్గ్ నుంచి విజయం సాధించారు. అయితే ఇప్పుడు స్మృతి ఇరానీతో పాటు వీరిద్దరికి కూడా మంత్రులుగా అవకాశం దక్కలేదు.

బాధ్యతాయుత విపక్షంగా వ్యవహరిస్తాం

డీకే శివకుమార్

న్యూఢిల్లీ: లోక్‌సభలో ఇండియా ఐక్య సంఘటన బాధ్యతాయుత ప్రతిపక్షంగా వ్యవహరిస్తుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, కర్నాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ సారధ్యంలోని విపక్ష ఇండియా ఐక్యసంఘటన మ్యాజిక్ ఫిగర్‌కు చాలా దూరంలోనే ఆగిపోయింది. బీజేపీ సైతం ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజారిటీని సొంతంగా సాధించలేకపోవడంతో తొలుత విపక్ష ఇండియా కూటమిలోనూ ఆశలు చిగురించాయి. మరోవైపు ఎన్డీయే పక్షాల సహకారంతో నరేంద్ర మోదీ మూడోసారి ఆదివారం సాయంత్రం ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశారు. వేచిచూసే ధోరణితో వ్యవహరించాలని, సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోవాలని ఇటీవల జరిగిన విపక్ష ఇండియా ఐక్య సంఘటన నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ విపక్షంలో కూర్చోవాలని నిర్ణయం తీసుకుందని డీకే శివకుమార్ వెల్లడించారు. ఆయన ఆదివారం ఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు. బాధ్యతాయుత ప్రతిపక్షంగా వ్యవహరిస్తూ ప్రజల తరపున పోరాడతామని డీకే పేర్కొన్నారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరయ్యారు. తమ భాగస్వామ్య పార్టీల నేతలతో సంప్రదింపులు జరిపిన అనంతరం ఖర్గే ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్నారు.

'ప్రధాని' పదవిని 'ఇండియా' ప్రతిపాదించలేదు: జేడీయూ

న్యూఢిల్లీ: జనతాదళ్ (యు) అధినేత, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌కు ఇండియా ఐక్య సంఘటన 'ప్రధాని' పదవి ప్రతిపాదించలేదని జేడీయూ ఎంపీ సంజయ్ ఝా వెల్లడించారు. తమ పార్టీ నేత కేసీ త్యాగి చెప్పిన అంశం పార్టీ దృష్టిలో లేదని స్పష్టంచేశారు. కేసీ త్యాగి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా పెద్ద దేమారం రేపాయి. ఇండియా ఐక్యసంఘటనలోని కొందరు అగ్రనేతలు నేరుగా నితీశ్‌ను సంప్రదించి ప్రధాని పదవి ఆఫర్ చేసేందుకు ప్రయత్నం చేశారని, కానీ ఆయన దాన్ని తిరస్కరించారని త్యాగి చెప్పారు. అయితే, ఈ వార్తల్లో ఏమాత్రం వాస్తవం లేదని కాంగ్రెస్ పార్టీ తోసిపుచ్చింది. దీనిపై సంజయ్ ఝా ఆదివారం స్పందించారు. నితీశ్ కుమార్‌కు అత్యంత నమ్మకస్తుడైన సంజయ్ ఝా మాట్లాడుతూ త్యాగి చేసిన వ్యాఖ్యల్లో ఏమాత్రం వాస్తవం లేదని స్పష్టం చేశారు. నితీశ్‌కు ఇండియా కూటమి ప్రధాని పదవి ఆఫర్ చేసిందన్న సమాచారం తమ పార్టీకి అందలేదని, నితీశ్‌కు సైతం ఈ విషయం తెలియదని పేర్కొన్నారు. తనకు అవగాహన ఉన్నంతవరకూ ఇండియా కూటమి నుంచి నితీశ్‌కు అలాంటి ప్రతిపాదన రాలేదని ఆయన తేల్చి చెప్పారు. త్యాగి అలా ఎందుకు మాట్లాడారో తనకు తెలియదని చెప్పారు.

ముంబై విమానాశ్రయంలో తప్పిన ఘోర ప్రమాదం

ముంబై: ముంబై విమానాశ్రయంలో వందల మంది ప్రయాణికులకు శనివారం ఘోర ప్రమాదం తప్పింది. ఓ ఇండిగో విమానం అవుతుండగా.. అదే రన్‌వేపై ఎయిర్ ఇండియా విమానం టేకాఫ్ అవుతోంది. రెండింటికీ మధ్య కొన్ని వందల మీటర్ల దూరమే ఉంది. ఈ ఘటనపై తక్షణమే స్పందించిన డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సిబ్బందిని విధుల నుంచి తప్పించింది. ఈ వీడియో ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారింది. రెండు విమానాలు ఒకే రన్‌వేపై ప్రయాణిస్తున్నాయి. ఇండోర్ నుంచి వచ్చిన ఇండిగో విమానం ల్యాండ్ అవుతుండగా... అదే సమయంలో ఎయిర్ ఇండియా విమానం తిరువనంతపురం వెళ్లేందుకు గాల్లోకి ఎగిరింది. ఈ ఘటనపై ఇండిగో స్పందించింది. తమ పైలట్ ముంబై విమానాశ్రయం ఏటీసీ సూచనలు తూచా తప్పకుండా పాటించాడని పేర్కొంది. జూన్ 8వ తేదీన ఇండిగో 6ఈ6053 విమానానికి ఏటీసీ నుంచి ల్యాండింగ్ క్లియరెన్స్ లభించింది. తమకు ప్రయాణికుల రక్షణే ముఖ్యం. పద్ధతి ప్రకారం ఈ ఘటనపై తాము రిపోర్టు చేశామని ఒక ప్రకటనలో వెల్లడించింది. మరో వైపు ఎయిర్ ఇండియా కూడా ఈ ఘటనపై ప్రకటన విడుదల చేసింది. ఏఐ657 తిరువనంతపురం వెళ్లే విమానానికి ఏటీసీ నుంచి క్లియరెన్స్ వచ్చిన తర్వాతే బయల్దేరామని, ఈ క్రమంలో సూచనల ప్రకారం తమ విమానం టేకాఫ్ అయిందని వెల్లడించింది. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టారని, అధికారులు ఎలా క్లియరెన్స్ ఇచ్చారనేది తెలియాల్సి ఉందని తన ప్రకటనలో పేర్కొంది.

బంగ్లా ఎంపీ హత్య కేసులో పురోగతి

శరీర భాగాలు గుర్తించిన పోలీసులు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో హత్యకు గురైన బంగ్లాదేశ్ ఎంపీ అన్వరుల్ అజీమ్ అనర్ కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఆయన శరీర భాగాల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేసిన అధికారులు... ఓ కాలువలో మానవ ఎముకలను గుర్తించారు. ఈ కేసుకు సంబంధించి కీలక అనుమానితుడిని నేపాల్‌లో అరెస్టు చేసిన పోలీసులు... భారత్‌కు తీసుకువచ్చారు. అతడు ఇచ్చిన సమాచారం మేరకు గాలింపు చేపట్టగా... బాధితుడిగా భావిస్తోన్న శరీర భాగాల ఎముకలు లభ్యమయ్యాయి. వైద్యులు, ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో గాలింపు జరపగా... ఆ కాలువలో మనిషికి సంబంధించిన ఎముకలు లభ్యమయ్యాయని, వాటిని ఫోరెన్సిక్ పరీక్ష కోసం పంపిస్తామని పోలీసులు తెలిపారు. ఇతర శరీర భాగాల కోసం గాలింపు కొనసాగుతుందని వెల్లడించారు. అంతకుముందు ఎంపీ శరీరానికి సంబంధించినవిగా భావిస్తోన్న దాదాపు మూడున్నర కిలోల మాంసపు ముద్దను హత్య జరిగిన అపార్టుమెంటు సెప్టిక్ ట్యాంకులోనే గుర్తించారు. బంగ్లా ఎంపీని హత్య చేసిన అనంతరం అతడి శరీర భాగాలను ముక్కలుగా చేసి పడేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే, వీటిలో కొన్నింటిని ఇప్పటికే స్వాధీన చేసుకున్నప్పటికీ... అవి నిర్ధారించుకోవడం కష్టంగా మారింది. దీంతో డీఎన్ఏ పరీక్ష నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఇందుకోసం బాధిత ఎంపీ కుమార్తె బంగ్లాదేశ్ నుంచి కోల్‌కతాకు రానున్నారు. మరోవైపు, ఈ హత్య కోసం ఎంపీ సన్నిహితుడే నిందితులకు దాదాపు రూ.5 కోట్లు చెల్లించినట్లు ప్రాథమిక విచారణలో తేలింది.

క్రియాశీల రాజకీయాలకు పాండియన్ దూరం

ఒడిశాలో బీజేడీ ఓటమి తర్వాత నిర్ణయం

భువనేశ్వర్ : ఒడిశాకు చెందిన పదవీ విరమణ చేయనున్న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సన్నిహితుడు, బీజేడీ సీనియర్ నాయకుడు వి.కె.పాండియన్ ఆదివారం లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలలో ప్రాంతీయ పార్టీ ఓటమి నేపథ్యంలో క్రియాశీల రాజకీయాల నుంచి వైదొలగుతున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వాధికారి నుంచి రాజకీయ నాయకుడిగా మారిన పాండియన్... ఒక వీడియో సందేశంలో, 'ఇప్పుడు నేను క్రియాశీల రాజకీయాల నుంచి వైదొలగాలని స్పృహతో నిర్ణయించుకున్నాను. ఈ ప్రయాణంలో ఎవరినైనా నొప్పించి ఉంటే క్షమించండి. బిజూ జనతాదళ్‌కు నష్టం కలిగించడంలో నాపై ఈ ప్రచార కథనం భాగమైతే నన్ను క్షమించండి. దీని కోసం 'కర్మి'లందరితో సహా మొత్తం బిజూ పరివార్‌కు నా క్షమాపణలు' అని తెలిపారు. రాజకీయాల్లోకి రావాలన్న ఏకైక ఉద్దేశం పట్నాయక్‌కు సహాయం చేయడమేనని, అందుకే ఎన్నికల్లో పోటీ చేయలేదని పాండియన్ చెప్పారు. ఒడిశాలో 147 మంది సభ్యులున్న అసెంబ్లీలో 78 సీట్లు గెలుచుకుని 24 ఏళ్ల బీజేడీ పాలనకు ముగింపు పలికి బీజేపీ అధికారంలోకి వచ్చింది. మరోవైపు పట్నాయక్ నేతృత్వంలోని పార్టీ 51 స్థానాలను కైవసం చేసుకోగా, కాంగ్రెస్ 14 స్థానాలు, సీపీఎం ఒకటి గెలుచుకుంది. రాష్ట్రంలోని లోక్‌సభ స్థానాల్లో బీజేడీ ఒక్కటి కూడా గెలవలేకపోయింది. బీజేపీ 20, కాంగ్రెస్ ఒకటి గెలుచుకుంది. కాగా, 'నేను ఎప్పుడూ ఒడిశాను నా హృదయంలో ఉంచుతాను. నా గురువు నవీన్ బాబును నా శ్వాసలో ఉంచుతాను' అని చెప్పారు.

బీజేపీ-టీఎంసీ మాటల యుద్ధం

కోల్‌కతా: మూడోసారి ప్రధానిగా నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారం చేయడానికి కొన్ని గంటల ముందు ఆదివారం టీఎంసీ, బీజేపీల మధ్య మాటల యుద్ధం జరిగింది. కోల్‌కతా మేయర్, టీఎంసీ నాయకుడు ఫిర్హాద్ హకీం... ఎన్‌డిఎ సంకీర్ణ ప్రభుత్వం ఎక్కువ కాలం కొనసాగదని విమర్శించగా... బీజేపీ నాయకుడు అర్జున్ సింగ్ మాట్లాడుతూ... హకీం తన రాజకీయ భవిష్యత్తు గురించి మరింత ఆందోళన చెందాలని ఎద్దేవా చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని బరాక్‌పూర్ నియోజకవర్గంలో టీఎంసీ చేతిలో ఓడిపోయిన సింగ్... ఆదివారం మోదీ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరు కావాల్సిందిగా తనకు ఆహ్వానం అందినట్లు ధృవీకరించారు. హకీం విలేకరులతో మాట్లాడుతూ... టీఎంసీ అధినేత్రి, బెంగాల్ సీఎం మమతాబెనర్జీ వ్యాఖ్యలను పునరుద్ఘాటించారు. ఎన్‌డిఎ ప్రభుత్వం స్వల్పకాలం మాత్రమే ఉంటుందని...మోదీ ప్రమాణ స్వీకారం తాత్కాలికమేనన్నారు. శనివారం మమత మాట్లాడుతూ... ఇండియా కూటమి ఇప్పుడు ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి ప్రయత్నించకపోవచ్చుని... దీని అర్థం తర్వాత చేయదని కాదని స్పష్టం చేశారు. టీఎంసీ ఎంపీలు , సీనియర్ నేతల సమావేశం తర్వాత ఆమె విలేకరులతో మాట్లాడుతూ, తమ పార్టీ వేచిచూసే విధానాన్ని అవలంబిస్తుందన్నారు. బీజేపీ నేతృత్వంలోని బలహీనమైన, అస్థిర ఎన్డీఏ ప్రభుత్వం అధికారం నుండి తొలగించబడుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌ది 'అహంకారం'

జేడీ(ఎస్) అధ్యక్షుడు దేవెగౌడ

న్యూఢిల్లీ: జనతా దళ్ (సెక్యులర్) అధ్యక్షుడు హెచ్‌డి దేవెగౌడ ఆదివారం కాంగ్రెస్‌పై ధ్వజమెత్తారు. ప్రతిపక్ష పార్టీది 'అహంకారం, ప్రతికూల వైఖరి' అని నిందించారు. అదే సమయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్‌డీఏ కొత్త ప్రభుత్వానికి తన పార్టీ పూర్తి మద్దతు తెలియజేస్తోందని తెలిపారు. జేడీ(ఎస్) కి కేబినెట్ స్థానం కల్పించినందుకు ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలుపుతూ గౌడ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయన కుమారుడు, కర్నాటక మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డి కుమారస్వామి జాతీయ రాజకీయాల్లోకి అరంగేట్రం చేయనున్నారు. ప్రధాని మోదీ కొత్త మంత్రి మండలిలో భాగంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఒక లేఖలో, వరుసగా మూడవసారి పదవీ బాధ్యతు చేపడుతున్న ప్రధాని మోదీకి అభినందనలు తెలిపారు. ఎన్నికల విజయానికి ప్రధానమంత్రిపై 'సర్వశక్తిమంతుడి అసాధారణ ఆశీర్వాదం' కారణమని పేర్కొన్నారు. గత దశాబ్దం మాదిరిగానే అంకితభావంతో దేశానికి ప్రధాని మోదీ సేవలందిస్తారని గౌడ విశ్వాసం వ్యక్తం చేశారు. మెరుగైన పనితీరుపై కాంగ్రెస్ వాదనలను తోసిపుచ్చిన దేవెగౌడ... కర్నాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ వంటి దాని పాలనలో ఉన్న రాష్ట్రాల్లో ఆ పార్టీ విజయం కోసం కొట్టుమిట్టాడిందని వాదించారు. ఇతర చోట్ల పార్టీ సాపేక్ష విజయం వారి మిత్రపక్షాల కారణంగా ఉంది. అలాంటి పొత్తులు ఎంతకాలం కొనసాగుతాయని ఆయన ప్రశ్నించారు. ఆరోగ్య సమస్యల కారణంగా ప్రమాణస్వీకార కార్యక్రమానికి హాజరు కాలేకపోవడం పట్ల విచారం వ్యక్తం చేసిన గౌడ ప్రధాని మోదీకి ఆహ్వానం పంపినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్‌డీఏ సభ్యుడిగా ఉన్న జేడీ(ఎస్) సమ్మిళిత అభివృద్ధి 'సబ్కా సాత్, సబ్కా వికాస్' అజెండాపై మోదీ ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తోందని ఆయన అన్నారు.

కౌర్‌కు మద్దతుగా రైతుసంఘాల భారీ ర్యాలీ

నిష్పక్షపాత విచారణ జరపాలని డిమాండ్

చండీగఢ్: బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రణావత్‌ను చండీగఢ్ విమానాశ్రయంలో చెంపదెబ్బ కొట్టిన సీఐఎస్ఎఫ్ మహిళా కానిస్టేబుల్ కుల్విందర్ కౌర్‌కు వివిధ రైతు సంఘాలు మద్దతుగా నిలిచాయి. ఈ కేసులో సదరు కానిస్టేబుల్‌కు అన్యాయం జరగకుండా చూడాలని డిమాండ్ చేస్తూ సంయుక్త కిసాన్ మోర్చా, కిసాన్ మజ్దూర్ మోర్చా సహా వివిధ రైతు సంఘాలు ఆదివారం మొహాలీలో భారీ ప్రదర్శన చేపట్టాయి. మహిళా కానిస్టేబుల్ కుల్విందర్ కౌర్‌కు ఎలాంటి అన్యాయం జరగకూడదని, ఈ వ్యవహారంపై న్యాయ విచారణ జరిపించాలని రైతు నాయకులు డిమాండ్ చేశారు. మొహాలీలోని గురుద్వారా ఎఎంబి సాహిబ్ నుండి ప్రదర్శన ప్రారంభం కాగా... తగిన భద్రత ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతు నాయకుడు సర్వన్ సింగ్ పంధేర్ విలేకరులతో మాట్లాడుతూ.... ఈ వ్యవహారంపై నిష్పక్షపాతంగా విచారణ జరగాలన్నారు. ఈ ఘటనకు దారి తీసిన విషయం తెలియాల్సి ఉందని, మహిళా కానిస్టేబుల్‌కు ఎలాంటి అన్యాయం జరగకూడదని స్పష్టం చేశారు. పంజాబ్ ప్రజలను రెచ్చగొట్టే ప్రకటనలు చేశారంటూ రణావత్‌పై కూడా రైతు నేతలు మండిపడ్డారు. రైతుల నిరసనలపై కంగన వైఖరిపై కలత చెందినట్లు తెలుస్తోందని చెప్పారు. కాగా విమానాశ్రయాల వద్ద భద్రతా ఏర్పాట్లు చూసే సీఐఎస్ఎఫ్...ఈ ఘటనపై కౌర్‌ను విధులనుంచి సస్పెండ్ చేస్తూ ఆదేశాలివ్వడంతోపాటు కోర్టు విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే. మొహాలీ పోలీసులు కౌర్‌పై ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ) సెక్షన్ 323, 341 కింద కేసు నమోదు చేశారు. ఈ రెండూ బెయిల్ లభించే సెక్షన్లు. కాగా కానిస్టేబుల్ తన వద్దకు వచ్చి దాడికి పాల్పడినట్లు కంగన ఫిర్యాదు చేశారు. "ఆమె నా ముఖం మీద కొట్టింది మరియు నన్ను దుర్భాషలాడడం ప్రారంభించింది. ఆమె ఎందుకు అలా చేసిందని నేను ఆమెను అడగ్గా... ఆమె రైతు నిరసనలకు మద్దతు ఇస్తున్నట్లు చెప్పింది" అని తెలిపారు. కాగా శుక్రవారం చండీగఢ్‌లో సంయుక్త కిసాన్ మోర్చా నాయకుడు జగ్జిత్ సింగ్ దల్లేవాల్, కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ జనరల్ సెక్రటరీ సర్వన్ సింగ్ పంధేర్ పంజాబ్ డీజీపీ గౌరవ్ యాదవ్‌ను కలిశారు. "ఈ ఘటన జరగడానికి గల మొత్తం పరిణామాలపై సమగ్ర దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉంది. మహిళా కానిస్టేబుల్‌కు అన్యాయం జరగకుండా చూడాలి" అని వారు విజ్ఞప్తి చేశారు. కుల్విందర్ కౌర్‌కు గాయకుడు, స్వరకర్త విశాల్ దద్లానీ తన మద్దతు ప్రకటించారు.

స్టాక్‌మార్కెట్ పతనంపై కేంద్రం, సెబీ వివరణ ఇవ్వాలి

సుప్రీంకోర్టులో పిటిషన్

న్యూఢిల్లీ: సార్వత్రికఎన్నికల ఫలితాల వెలువడిన జూన్ 4న భారీ స్థాయిలో స్టాక్ మార్కెట్లు పతనమై ఇన్వెస్టర్లు కోట్లాది రూపాయలు నష్టపోవడానికి సంబంధించి వివరణాత్మక నివేదికను సమర్పించాల్సిందిగా కేంద్రప్రభుత్వం, సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ)ని ఆదేశించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. న్యాయవాది విశాల్ తివారీ ఈ పిటిషన్ దాఖలు చేశారు. అదానీ-హిండెన్‌బర్గ్ విషయంలో దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్)పై జస్టిస్ ఎఎం సప్రే నేతృత్వంలోని నిపుణుల కమిటీ తన నివేదికలో చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకుని జనవరి 3న ఇచ్చిన ఆదేశాలపై స్టేటస్ రిపోర్ట్‌ను సమర్పించాల్సిందిగా కూడా ప్రభుత్వం, సెబీని ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు. నిపుణుల కమిటీ సూచనలను కేంద్రం, సెబీ నిర్మాణాత్మకంగా పరిగణించాలని నియంత్రణ చట్రాన్ని బలోపేతం చేయడానికి, పెట్టుబడిదారులను రక్షించడానికి, సెక్యూరిటీల మార్కెట్ క్రమబద్ధ పనితీరును నిర్ధారించడానికి అవసరమైన తదుపరి చర్యలు తీసుకోవాలని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. 'లోక్‌సభ 2024 ఫలితాలకు సంబంధించి ఎగ్జిట్ పోల్స్ ప్రకటనల తర్వాత అధిక స్థాయికి పెరిగిన షేర్ మార్కెట్... వాస్తవ ఫలితాలు ప్రకటించగానే పతనమైంది' అని పిటిషన్ పేర్కొంది. 'స్టాక్ మార్కెట్ అస్థిరత మళ్లీ ఉద్భవించింది. వార్తా నివేదికల ప్రకారం నష్టం రూ. 20 లక్షల కోట్లు. ఇది మళ్లీ నియంత్రణ యంత్రాంగంపై ప్రశ్నార్థకతను లేవనెత్తింది... ఈ కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ ఏమీ మారలేదు' న్యాయవాది విశాల్ తివారీ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. బీజేపీ భారీ విజయం సాధిస్తుందన్న ఎగ్జిట్ పోల్ అంచనాల ప్రకారం... బీఎస్ఇ బెంచ్‌మార్క్ సెన్సెక్స్ సోమవారం 2,507 పాయింట్లు లేదా 3.4 శాతం పెరిగి 76,469 వద్ద కొత్త ముగింపు గరిష్ఠ స్థాయికి చేరుకుంది. అయితే ఒక రోజు తర్వాత మంగళవారం ఈక్విటీ మార్కెట్లు కుప్పకూలాయి. సెన్సెక్స్ 4,390 పాయింట్లు లేదా 6 శాతం దిగజారి 72,079 వద్ద స్థిరపడింది. నాలుగేళ్ల తర్వాత ఒకరోజులో ఇదే అత్యంత దారుణ పతనం.

ఉద్ధవ్ వర్గం ఎంపీలు ఇద్దరు మాతోనే: షిండే శివసేన

ముంబై: శివసేన ఉద్ధవ్ వర్గానికి చెందిన ఇద్దరు ఎంపీలు తమతో సంప్రదింపులు జరుపుతున్నారని షిండే వర్గం ప్రకటించింది. ఈ విషయాన్ని థానే నుంచి విజయం సాధించిన ఆ వర్గం ఎంపీ నరేశ్ వెల్లడించారు. ఇప్పుడు ఆ ఇద్దరు ఎంపీలు వస్తే... అనర్హత వేటు పడే అవకాశం ఉండటంతో ఆరుగురు ఎంపీలతో కలిసి ఎన్‌డీఏలో చేరేందుకు యత్నిస్తున్నారని ఆయన వివరించారు. 'ఆపరేషన్ బౌ అండ్ యారో' విజయం సాధిస్తుందని తెలిపారు. ఇద్దరు ఎంపీలు తమతో టచ్‌లో ఉన్నారని, ఉద్ధవ్ వర్గం ఓట్లు అడిగిన తీరుపై వారు అసంతృప్తి చెందారని నరేశ్ చెప్పారు. ఇండియా ఐక్య సంఘటన ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని వారు భావించారని, కానీ, అది జరగకపోవడంతో నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు కోసం ప్రధాని మోదీకి మద్దతు ఇవ్వాలనుకుంటున్నారని నరేశ్ వివరించారు. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో షిండే వర్గం మొత్తం ఏడు ఎంపీ సీట్లు గెలుచుకొంది. ఉద్ధవ్ వర్గం తొమ్మిది స్థానాల్లో విజయం సాధించింది. తాజాగా ఈ వ్యాఖ్యలపై ఉద్ధవ్ వర్గానికి చెందిన సుష్మా అంధారే మాట్లాడుతూ ప్రజల దృష్టిని ఆకర్షించేందుకు నరేశ్ ఇదంతా చేస్తున్నారని ఆరోపించారు. అపరిపక్వమైన ఈ ప్రకటన ఆయన ఆలోచనా తీరును తెలియజేస్తోందన్నారు. అలాంటి వారిని పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. అతడు ఇప్పుడు ఓ ఎంపీ అని, అలా ప్రకటించి ఉండకూడదన్నారు. పేర్లు ఉంటే వాటిని బహిర్గతం చేయాలని, కేంద్ర మంత్రి పదవులు పొందేందుకు ఆయన ఇలాంటివి చేస్తున్నారని మండిపడ్డారు. ఉద్ధవ్ వర్గానికే చెందిన ఎమ్మెల్సీ సచిన్ అహిర్ మాట్లాడుతూ తమ ఎంపీలు పార్టీకి విశ్వాసంగా ఉంటారని, వారంతా షిండే సేన, బీజేపీతో పోరాడారన్నారు. అలాంటి వారు పార్టీ మారతారని ఎలా అనుకొన్నారని వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్‌కు డిప్యూటీ స్పీకరు?

మోదీ కేబినెట్‌లో అత్యంత పిన్న వయస్కుడు రామ్మోహన్

న్యూదిల్లీ: ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్ ప్రమాణ స్వీకార మహోత్సవం ఉల్లాసంగా జరిగింది. మోదీ కేబినెట్‌లో అతిపిన్న వయస్కుడిగా టీడీపీ ఎంపీ కింజారపు రామ్మోహన్ నాయుడు నిలిచారు. శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎంపీగా ఎన్నికైన రామ్మోహన్ వయసు 36 సంవత్సరాలే. 26 ఏళ్లకే తొలిసారి ఎంపీగా గెలుపొందారు. రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనతో ప్రమాణం చేయించారు. ఆయనతోపాటు టీడీపీ నుంచి మరో ఎంపీ చంద్రశేఖర్ పెమ్మసానిని కూడా మంత్రి పదవి వరించింది. పెమ్మసాని గుంటూరు ఎంపీగా తొలిసారి గెలుపొందారు. తొలి గెలుపుతోనే నేరుగా కేంద్రమంత్రి పదవి చేపట్టడంతో ఆయన ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. కాగా, కేంద్ర మాజీమంత్రి, దివంగత ఎర్రన్నాయుడు కుమారుడిగా రామ్మోహన్ నాయుడు రాజకీయాల్లోకి వచ్చారు. ఎర్రన్నాయుడు 2012లో రోడ్డు ప్రమాదంలో మరణించడంతో రాజకీయాల్లోకి వచ్చిన రామ్మోహన్ నాయుడు 2014, 2019, 2024 ఎన్నికల్లో శ్రీకాకుళం నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీచేసి మూడుసార్లు గెలిచారు. రామ్మోహన్ ఆర్కేపురంలోని దిల్లీ పబ్లిక్ స్కూల్‌లో పాఠశాల విద్య పూర్తి చేశారు. ఆపై ప్రఖ్యాత పర్డ్యూ విశ్వవిద్యాలయం నుండి ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా గ్రాడ్యుయేట్ పట్టా పొందారు. ఆ తరువాత ఎంబీఏలో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ అభ్యసించారు. తండ్రిలాగే రామ్మోహన్ కూడా టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుకు అత్యంత సన్నిహితుడిగా ఉన్నారు. గతంలోనూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఎంపీగా అసాధారణ పనితీరు కనబరిచినందుకు రామ్మోహన్‌ను 2020లో సంసద్ రత్న అవార్డుతో సత్కరించారు

పదేళ్ల తర్వాత లోక్‌సభలో ప్రతిపక్ష నేత హోదా

న్యూదిల్లీ: 18వ లోక్‌సభలో ఇండియా ఐక్య సంఘటన పార్టీల సీట్ల సంఖ్య పెరగడంతో దిగువ సభ పదేళ్ల తర్వాత ప్రతిపక్ష నాయకుడిని పొందేందుకు సిద్ధమయ్యింది. గత ఐదేళ్లుగా ఖాళీగా ఉన్న డిప్యూటీ స్పీకర్ పదవికి త్వరలో ఎన్నికలు జరుగుతాయని ప్రతిపక్ష నేతలు కూడా ఆశిస్తున్నారు. జూన్ 5న రద్దయిన 17వ లోక్‌సభ పూర్తి కాలానికి డిప్యూటీ స్పీకర్‌ను కలిగి లేదు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత లేకుండా దిగువ సభకు ఇది వరుసగా రెండోసారి. ప్రతిపక్ష నేతను పొందే దిగువ సభపై అందరి దృష్టి ఉంది. అలాగే, డిప్యూటీ స్పీకర్ పదవికి కూడా ఎన్నిక జరుగుతుందని అందరూ ఆశిస్తున్నారు. ఈ పదవి సాధారణంగా ప్రతిపక్ష శ్రేణులకు వెళుతుంది. పార్లమెంటుకు సంబంధించిన వ్యూహంపై ఇండియా ఐక్య సంఘటన ఇంకా ఎలాంటి సమన్వయ సమావేశాన్ని నిర్వహించనప్పటికీ, ఈసారి డిప్యూటీ స్పీకర్ పదవిని ఖాళీగా ఉంచకూడదని ఒత్తిడి తెస్తామని ఒక ప్రతిపక్ష నాయకుడు చెప్పారు. 'బీజేపీ ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరించారు. గత ఐదేళ్లలో వారు ఏ డిప్యూటీ స్పీకర్‌ను ఎన్నుకోలేదు. వారు గుణపాఠం నేర్చుకొని ఈసారి డిప్యూటీ స్పీకర్‌ను ఎన్నుకుంటారని ఆశిస్తున్నాం' అని టీఎంసీ నాయకుడు ఒకరు అన్నారు. 17వ లోక్‌సభలో బీజేపీ 303 సీట్లతో పూర్తి మెజారిటీతో ఓం బిర్లాను స్పీకర్‌గా ఎన్నుకుంది. మొదటిసారిగా, ఐదేళ్ల కాలానికి డిప్యూటీ స్పీకర్‌ను ఎన్నుకోలేదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 93 ప్రకారం, లోక్‌సభ వీలైనంత త్వరగా ఇద్దరు సభ్యులను స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నుకోవాలి. ఈ పదవులకు నిర్దిష్ట కాలపరిమితి ఉండదు. 'డిప్యూటీ స్పీకర్ కార్యాలయం రాజ్యాంగ ఆవశ్యకం. అయితే, సమస్యాత్మక ధోరణి ఏమిటంటే, జాతీయ, రాష్ట్ర శాసనసభలు డిప్యూటీ స్పీకర్ పదవులను భర్తీ చేయలేదు. ఉదాహరణకు, 2019-2024 మధ్య డిప్యూటీ స్పీకర్ లేరు. రాజస్తాన్ గత అసెంబ్లీకి దాని పూర్తి ఐదేళ్ల కాలానికి డిప్యూటీ స్పీకర్ కూడా లేరు' అని పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్‌లో శాసన, పౌర ఎంపిక కార్యక్రమాలకు నాయకత్వం వహిస్తున్న చక్షు రాయ్ పీటీఐకి చెప్పారు. కాగా దీనికి ముందు దిగువ సభకు డిప్యూటీ స్పీకర్ లేని సుదీర్ఘ కాలం 12వ లోక్‌సభలో ఉంది.

ఫొటోలు, వీడియోలు సాక్ష్యం కావు దిల్లీ హైకోర్టు

న్యూదిల్లీ: సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకూ పెరిగిపోతోంది. డీప్ ఫేక్ ఫొటోలే అసలైన ఫొటోలుగా చలామణి అవుతున్న రోజుల్లో ఫొటోలు, వీడియోలను సాక్ష్యాలుగా పరిగణించలేమని దిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. కేవలం ఫొటోలు, వీడియోలు ఇస్తే సరిపోదని, అవి నిజమైనవేననే ఆధారాలు కూడా ఇవ్వాల్సిందేనని తేల్చిచెప్పింది. ఈ మేరకు ఓ జంట విడాకుల కేసుకు సంబంధించి దిల్లీ హైకోర్టు ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. దిల్లీకి చెందిన ఓ జంటకు ఫ్యామిలీ కోర్టు విడాకులు మంజూరు చేసింది.

భార్య, ఐదేళ్ల కూతురుకు కలిపి నెలనెలా రూ.75 వేలు భరణం కింద చెల్లించాలని భర్తను కోర్టు ఆదేశించింది. అయితే, తన భార్యకు వివాహేతర సంబంధం ఉందని, అందువల్ల తాను ఎలాంటి భరణం చెల్లించాల్సిన అవసరం లేదని భర్త వాదించారు. ఫ్యామిలీ కోర్టు తీర్పును హైకోర్టులో సవాల్ చేశాడు. భార్య వివాహేతర సంబంధానికి సాక్ష్యంగా ఫొటోలను కోర్టుకు సమర్పించాడు. ఈ కేసును జస్టిస్ రాజీవ్ షక్దర్, జస్టిస్ అమిత్ బన్సల్ ధర్మాసనం విచారించింది. భార్యకు వివాహేతర సంబంధం ఉందంటూ భర్త సమర్పించిన ఫొటోలు స్పష్టంగా లేవని ధర్మాసనం అభిప్రాయపడింది. అంతేకాకుండా డీప్ ఫేక్ ఫొటోల బెడద నేపథ్యంలో ఆ ఫొటోలను సాక్ష్యంగా పరిగణించలేమని స్పష్టం చేసింది. మరింత స్పష్టమైన ఫొటోలు, అవి నిజమైనవేననే ఆధారాలతో కోర్టుకు అందజేస్తే పరిశీలిస్తామని పేర్కొంది.

నలుగురు బందీల కోసం 274 మంది బలి

ఆగని ఇజ్రాయిల్ దాడులు

గాజా: గాజాలో ఉద్ధృత పోరు కొనసాగుతోంది. సెంట్రల్ గాజాలోని రెండు వేర్వేరు ప్రదేశాల్లో ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహించి... నలుగురు బందీలను కాపాడినట్లు ఇజ్రాయిల్ ప్రకటించింది. ఈ ప్రయత్నంలో టెల్‌అవీవ్ దళాలు జరిపిన దాడుల్లో స్థానికంగా భారీ ప్రాణనష్టం జరిగినట్లు తెలుస్తోంది. దాదాపు 274 మంది పలస్తీనీయన్లు ప్రాణాలు కోల్పోయినట్లు గాజా ఆరోగ్య విభాగం వెల్లడించింది. మరో 700 మంది గాయపడ్డారని పేర్కొంది. బాధితుల హాహాకారాలతో అల్-అఖ్సా ఆసుపత్రి నిండిపోయినట్లు ఓ స్వచ్ఛంద సంస్థ తెలిపింది. బందీలను రక్షించే సమయంలో బలగాలపై భారీఎత్తున దాడులు జరిగాయని ఇజ్రాయిల్ సైన్యం అధికార ప్రతినిధి డేనియల్ హగారీ తెలిపారు. ఈ సహాయ చర్యల్లో ఓ అధికారి మృతి చెందినట్లు చెప్పారు. 'నుసిరత్‌లోని రెండు వేర్వేరు అపార్ట్‌మెంట్‌లలో బందీలను ఉంచారు. వాటి మధ్య దాదాపు 200 మీటర్ల దూరం ఉంది. రెండు భవంతుల్లోకి మా బలగాలు ఒకే సమయంలో ప్రవేశించాయి. అయితే వారిపై పెద్దఎత్తున దాడులు జరిగాయి. పరిసరాల నుంచి రాకెట్ గ్రనేడ్‌లు ప్రయోగించారు. దీంతో బలగాలను, బందీలను రక్షించేందుకు ప్రతిచర్యలు తీసుకున్నాం' అని వివరించారు. గత ఏడాది అక్టోబరులో హమాస్ ఉగ్రవాదులు ఇజ్రాయిల్‌పై మెరుపుదాడి చేశారు. దీంతో దాదాపు 250 మందిని కిడ్నాప్ చేసి గాజాకు తరలించారు. నవంబరులో రెండు పక్షాల నడుమ కాల్పుల విరమణ సమయంలో కొంతమందిని విడిచిపెట్టారు. ఇంకా 120 మంది హమాస్ చెరలో ఉన్నారని ఇజ్రాయిల్ చెబుతోంది. వారిని గాజాలోని జనసమ్మర్థ ప్రదేశాలు, సొరంగాల్లో ఉంచినట్లు సమాచారం. దీంతో వారిని కాపాడటం టెల్‌అవీవ్‌కు సవాల్‌గా మారుతోంది. ఫిబ్రవరిలోనూ ఇదే తరహా ఆపరేషన్ నిర్వహించి...ఇద్దరు బందీలను కాపాడగా 74 మంది పలస్తీనీయన్లు మృతి చెందారు.

మహారాష్ట్రలో భారీ వర్షాలు

ముంబై: మహారాష్ట్ర రాజధాని ముంబై సహా సమీప ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. శనివారం నుండి భారీ వర్షాలు కురుస్తున్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అధిక ఉష్ణోగ్రతలు, తేమతో కూడిన వాతావరణం నుండి ఈ వర్షాలు ప్రజలకు ఉపశమనం కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. అయితే భారీ వర్షాల కారణంగా మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లా మల్జిపాడ ప్రాంతంలో రహదారి కుంగిపోయింది. ఈ ప్రాంతంలో మరమ్మతులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ముంబై-అహ్మదాబాద్ జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం నాలుగు గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. థానే, పాల్ఘర్ జిల్లాల్లోని రోడ్లపై వరద నీరు ముంచెత్తినట్లు అధికారులు తెలిపారు. థానేలో చాలాచోట్ల చెట్లు నేలకూలాయి. థానే, నాసిక్, ఛత్రపతి శంభాజీనగర్, అహ్మద్ నగర్, సతారా, జల్గావ్ సహా మహారాష్ట్రలోని ఇతర జిల్లాల్లో శనివారం నుండి వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం ఉదయం 8.30 వరకు 24 గంటల వ్యవధిలో ముంబైలో 60 మి.మీ కంటే అధిక వర్షపాతం నమోదైందని అధికారులు వెల్లడించారు. థానేలో 37.06 మి.మీ వర్షపాతం నమోదైంది. దక్షిణ ముంబైలోని కొలాబా అబ్జర్వేటరీలో 67 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. శాంతాక్రజ్ అబ్జర్వేటరీలో 64 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది.

ఒడిశా సీఎం అభ్యర్థిపై ఉత్కంఠ

భువనేశ్వర్: ఒడిశాలో తొలిసారి ప్రభుత్వ ఏర్పాటుకు బీజేపీ సిద్ధమవుతోంది. తొలుత జూన్ 10న ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుం దని భావించినప్పటికీ... దానిని 12కు వాయిదా వేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బిజీ షెడ్యూల్ కారణంగా తాజా మార్పు చోటుచేసుకుం దని బీజేపీ నేతలు జతిన్ మొహంతి, విజయ్‌పాల్ సింగ్ వెల్లడించారు. ప్రధానిగా మూడోసారి ప్రమాణ స్వీకారం చేయడం, మరుసటి రోజు నూతన ఎంపీలతో మోదీ భేటీ కానుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. వీటితోపాటు బీజేపీ శాసనసభా పక్ష సమావేశం జూన్ 11న జరగనుంది. ఈ క్రమంలోనే ఒడిశా కొత్త సీఎం ప్రమాణ స్వీకార కార్యక్రమం వాయిదా పడింది. ఒడిశా కొత్త ముఖ్యమంత్రి ఎవరనే విష యంపై ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. సీనియర్ బీజేపీ నేత, కొత్తగా ఎమ్మెల్యేగా ఎన్నికైన సురేశ్ పూజారి పేరు తెరపైకి వచ్చింది. తాజాగా ఆయన దిల్లీ బయలుదేరి వెళ్లారు. దీంతో ముఖ్యమంత్రి ఆశావహుల జాబితాలో పూజారి పేరు కూడా ఉందనే ఊహాగానాలు మొదలయ్యాయి. 2019 ఎన్నికల్లో బార్‌గఢ్ లోక్‌సభ స్థానం నుంచి ఆయన గెలుపొందారు. తాజాగా అసెంబ్లీ ఎన్నికల్లో బ్రజారాజ్‌నగర్ అసెంబ్లీ స్థానం నుంచి విజయం సాధించారు. అయితే, సీఎం ఎవరనే అంశంపై బీజేపీ అధిష్ఠానం మాత్రం ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. దీనిపై ఉత్కంఠ వీడాలంటే మరో రెండు రోజులు ఆగాల్సిందేనని ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మన్మోహన్ సమాల్ పేర్కొన్నారు. దీనిపై బీజేపీ పార్లమెంటరీ బోర్డు తుది నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఇదిలా ఉంటే రెండున్నర దశాబ్దాలపాటు రాష్ట్రాన్ని పాలించిన బిజూ జనతాదళ్... తాజా అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం పాలయింది. మొత్తం 147 అసెంబ్లీ స్థానాలకుగాను బీజేపీ 78 చోట్ల గెలిచింది. ముఖ్యమంత్రి అభ్యర్థి పేరు చెప్పకుండానే ఎన్నికల్లో ముమ్మర ప్రచారం చేసిన కాషాయ పార్టీ... ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సీట్లు కైవసం చేసుకుంది.

రూ.14,800 కోట్ల ఎఫ్‌పీఐలు వెనక్కి

న్యూదిల్లీ: విదేశీ సంస్థాగత మదుపర్లు పెద్దఎత్తున పెట్టుబడులను దేశీయ మార్కెట్ల నుంచి ఉపసంహరించుకున్నారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు అంచనాలకు భిన్నంగా రావడం... అదే సమయంలో చైనా స్టాక్ మార్కెట్ ఆకర్షణీయంగా ఉండటంతో ఈ నెల మొదటి వారంలో ఎఫ్‌పీఐలు దేశీయ స్టాక్ మార్కెట్ నుంచి దాదాపు రూ.14,800 కోట్లు వెనక్కి తీసుకున్నారు. మారిషస్‌తో భారత్‌కున్న పన్ను ఒప్పందాన్ని సవరిస్తారన్న ఆందోళనలు, అమెరికా బాండ్ రాబడుల్లో స్థిరమైన పెరుగుదల కారణంగా ఏప్రిల్‌లో రూ.8,700 కోట్లకు పైగా పెట్టుబడులు వెనక్కి తీసుకున్నారు. మే నెలలో ఎన్నికల ఫలితాలపై భిన్న అంచనాల కారణంగా ఏకంగా రూ.25,586 కోట్లను మార్కెట్ నుంచి తరలించారు. మార్చిలో రూ.35,098 కోట్లు, ఫిబ్రవరిలో నికరంగా రూ.1,539 కోట్ల పెట్టుబడులు పెట్టారు. జనవరిలో రూ.25,743 కోట్లు వెనక్కితీసుకున్నారు. ఈ నెల జూన్ 7 నాటికి నికరంగా రూ.14,794 కోట్ల డబ్బును మార్కెట్ నుంచి ఉపసంహరించుకున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమి భారీ మెజార్టీతో గెలుస్తుందని దాదాపు అన్ని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. దీంతో మార్కెట్ బాగా రాణించింది. తీరా ఫలితాలు అందుకు భిన్నంగా రావడం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీంతో సూచీలు నష్టాలు చవిచూశాయి. లోక్‌సభ ఎన్నికల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ రాకపోవడం వల్ల విదేశీ పెట్టుబడుదారులు ఆందోళన చెందుతున్నారని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. అదే సమయంలో చైనా స్టాక్ మార్కెట్ ఆకర్షణీయంగా ఉండటంతో పెట్టుబడులు అక్కడికి తరలి వెళ్లాయంటున్నారు. మరోవైపు డెట్ మార్కెట్‌లో ఎఫ్‌పీఐలు రూ.4,000 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టారు. మార్చిలో రూ.13,602 కోట్లు, ఫిబ్రవరిలో రూ.22,419 కోట్లు, జనవరిలో రూ.19,836 కోట్లు పెట్టారు. జేపీ మోర్గాన్ సూచీలో భారత ప్రభుత్వ బాండ్లు చేరడంతో ఈ పెట్టుబడులు వచ్చాయి. ఇలా మొత్తంగా 2024లో ఎఫ్‌పీఐలు ఇప్పటివరకు ఈక్విటీల నుంచి రూ.38,158 కోట్ల నికర మొత్తాన్ని ఉపసంహరించుకోగా... డెట్ మార్కెట్లో రూ.57,677 కోట్లు పెట్టుబడులు పెట్టారు.

బెదిరిన బీజేపీ

- యూపీ, మహారాష్ట్ర, బెంగాల్‌లో ఎదురుదెబ్బ
- అక్కడ 170 స్థానాల్లో దక్కింది 54 సీట్లే
- కాషాయ పార్టీకి మింగుడుపడని వైనం
- భవిష్యత్ రాజకీయ పరిణామాలపై ఆందోళన

లక్నో/ముంబై/కోల్‌కతా: 18వ లోక్‌సభ ఎన్నికల ఫలితాలు కాషాయ పార్టీ బీజేపీకి మింగుడుపడటం లేదు. ఏదో విధంగా అధికారాన్ని చేజిక్కిందనుకున్నప్పటికీ మూడు అతిపెద్ద రాష్ట్రాలయిన ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్‌లో తీవ్ర ఎదురుగాలి చవిచూడటంపై ఆ పార్టీ కేంద్ర, రాష్ట్ర నాయకులు ఆందోళన చెందుతున్నారు. ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్‌లో 170 మంది లోక్‌సభ ఎంపీలు ఉన్నారు. ఇందులో నరేంద్ర మోదీ పార్టీ కేవలం 54 స్థానాల్లో మాత్రమే గెలుపొందింది. మూడు పెద్ద రాష్ట్రాల్లోని 170 సీట్లు... యూపీ (80), మహారాష్ట్ర (48), బెంగాల్ (42) నితీశ్ కుమార్, నారా చంద్రబాబు నాయుడు అనే రెండు 'ఎన్' అండదండలు లేకుండానే మోదీ మూడవసారి ప్రధానిగా ఉండటానికి సహాయపడతాయి. మూడు పెద్ద రాష్ట్రాలు 2019లో మోదీ, బీజేపీ చుట్టూ అజేయత ప్రకాశాన్ని సుస్థిరం చేయడంలో కీలక పాత్ర పోషించాయి. కానీ కాలం మారి ఉండవచ్చు అని లోక్‌సభ ఎన్నికల ఫలితాలు చూపిస్తున్నాయి.

బెంగాల్‌లో టీఎంసీని ఎదుర్కోలేకపోయిన బీజేపీ

2019 నాటి బిగ్ బెంగాల్ బ్యాంగ్ 2021లో ఒక దగ్గర కొసమెరుపుతో ముగిసింది. ఆ పార్టీ 2019లో రాష్ట్రంలో 18 లోక్‌సభ స్థానాలను గెలుచుకుంది. అయితే రెండేళ్ల తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆ విజయాన్ని పునరావృతం చేయడంలో విఫలమైంది. 2024లో లోక్‌సభ ఎన్నికలకు బీజేపీ వెళ్లినప్పుడు పుంజుకున్నట్లు అనిపించింది. మహిళలపై లైంగిక వేధింపులు, ఉపాధ్యాయుల నియామక కుంభకోణం, కలకత్తా హైకోర్టు తీర్పు, భూకబ్జా ఆరోపణలతో పాటు సందేశ్‌ఖాలీలో జరిగిన ఆందోళనతో మమతా బెనర్జీకి వ్యతిరేకంగా స్పష్టమైన అధికార వ్యతిరేకత వ్యక్తమైంది. అయితే ప్రతి ఎన్నికల ముందు మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని వెంటాడుతున్న ఇతర అవినీతి సమస్యలు ఉన్నప్పటికీ, ఆమె పార్టీ ప్రతి ఎన్నికలలో విజయం సాధించింది. ఈ లోక్‌సభ ఎన్నికల్లో 2019 సార్వత్రిక ఎన్నికల్లో పొందిన 40.6 శాతం కంటే 38.73 శాతం ఓట్ల శాతం స్వల్పంగా తక్కువగా ఉన్నప్పటికీ, ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 12 స్థానాలకు పడిపోయింది. 2021 అసెంబ్లీ ఎన్నికలలో వచ్చిన 37 శాతం ఓట్ల కంటే కొంచెం ఎక్కువ. మరోవైపు రాష్ట్రంలో అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీ తన సంఖ్యను 22 నుంచి 29కి పెంచుకోవడమే కాకుండా, ఓట్ల వాటాను 45.77 శాతానికి పెంచుకుంది. ఇది గత లోక్‌సభ ఎన్నికల కంటే 2 శాతం పాయింట్ల పెరుగుదల. కృష్ణనగర్, ఆరంబాగ్ (మోదీ ప్రచారం చేసిన చోట) వంటి దక్షిణ బెంగాల్ స్థానాల్లో చాలావరకు బీజేపీ సునాయాసంగా గెలుస్తుందని భావించిన వాటిలో కాషాయ పార్టీ ఘోరంగా ఓడిపోయింది. 'దేశవ్యాప్తంగా మోదీ వేవ్ లేదనడాన్ని కాదనలేం. పశ్చిమ బెంగాల్ కూడా భిన్నంగా లేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన సంక్షేమ పథకాలపై తృణమూల్ భారీగా ప్రచారం చేసింది. మేము దానిని ఎదుర్కోలేకపోయాము' అని బీజేపీ బెంగాల్ నాయకుడు ఒకరు తెలిపారు. ఫలితాల నుంచి బీజేపీ బెంగాల్ ఇద్దరు నాయకులు... బిష్ణుపూర్ నుంచి కేవలం 5 వేల ఓట్ల తేడాతో సౌమిత్రా ఖాన్ గెలవగా, రాష్ట్ర నాయకత్వంపై బహిరంగంగానే విమర్శలు చేసిన పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు దిలీప్ ఘోష్ బుర్ద్వాన్-దుర్గాపూర్ నుంచి కీర్తి ఆజాద్ చేతిలో 1.38 లక్షల ఓట్లతో ఓటమి పాలయ్యారు. ఇక బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సుకాంత మజుందార్ కూడా కేవలం 10 వేల ఓట్ల స్వల్ప మెజారిటీతో గెలుపొందారు. 2019లో ఆయన గెలుపు ఆధిక్యం 33 వేలకు పైగా ఉంది. బీజేపీ ప్రచార ముఖమైన అధికారి ఫలితాల తర్వాత ప్రజల్లో కనిపించడం లేదు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత అధికారి విఫలమవడం ఇది రెండోసారి. దిలీప్ ఘోష్ నేతృత్వంలో 2019లో బీజేపీ తృణమూల్‌కు తీవ్రమైన సవాలుగా నిలిచింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత ఆయనను పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తప్పించారు. ఈ ఎన్నికల్లో అతను గతసారి గెలిచిన మిద్నాపూర్ నుంచి బుర్ద్వాన్-దుర్గాపూర్‌కు మారాల్సి వచ్చింది. మిద్నాపూర్ సీటును కూడా బీజేపీ కోల్పోయింది.



బెంగాల్‌కు చెందిన 12 మంది బీజేపీ ఎంపీలలో 'కనీసం ఐదుగురు' మమతా బెనర్జీ పార్టీతో సంప్రదింపులు జరుపుతున్నారని, పార్టీ మారాలనే ఆశతో ఉన్నారని వార్తలు వినిపిస్తున్నాయి. హోం శాఖ సహాయ మంత్రి నిసిత్ ప్రమాణిక్ ఓడిపోయిన కూచ్ బెహర్‌లో ఇప్పటికే మూడు పంచాయతీలను తృణమూల్ స్వాధీనం చేసుకుంది. శనివారం మరో ఐదుగురు పంచాయతీ సభ్యులు తృణమూల్‌లో చేరారు.

మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల రణరంగం వేళ...

ఈ ఏడాది చివర్లో మహారాష్ట్ర (హర్యానాతో పాటు) అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. బీజేపీ, దాని మిత్ర పక్షాల ప్రదర్శన పేలవంగా ఉన్నప్పటికీ, ప్రత్యర్థి మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) సంఖ్యాపరంగా అంత సౌకర్యంగా లేదు. ఎంవీఏ (కాంగ్రెస్, ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన, శరద్ పవార్‌కు చెందిన నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీతో కూడినది) సుమారు 44 శాతం ఓట్లు పోలయ్యాయి. మహాయుతి (బీజేపీ, ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ) ఉన్నప్పటికీ తక్కువ స్థానాల్లో 43.6 శాతం ఓట్లు వచ్చాయి. అయితే 2019లో గెలిచిన 23 లోక్‌సభ స్థానాల నుంచి బీజేపీ తొమ్మిదికి పడిపోయింది. అయితే దాని మిత్రపక్షాలు షిండే, అజిత్ పవార్‌కు చెందిన రెండు పార్టీలు పోటీ చేసిన 19 సీట్లలో ఎనిమిది మాత్రమే దక్కించుకున్నారు. మహారాష్ట్రలో కూటమిలో అత్యధికంగా లబ్ధి పొందుతున్నది కాంగ్రెస్, అది పోటీ చేసిన 17 స్థానాల్లో 13 స్థానాలు గెలుచుకుంది. ముంబైకి చెందిన ఒక కాంగ్రెస్ నాయకుడు మాట్లాడుతూ 'ఈ పార్టీలన్నీ కలిసి రావడం వల్ల బీజేపీకి అత్యంత నష్టం వాటిల్లింది. కీలకమైన సీట్లను గెలుచుకోవడంలో మాకు సహాయపడిన మరో అంశం మాజీ ప్రత్యర్థుల మధ్య ఓట్లను పూర్తిగా బదిలీ చేయడం' అని తెలిపారు. అయితే ఠాక్రేల వెంట ఉన్న సంప్రదాయ సేన ఓటర్లు కాంగ్రెస్‌కు ఓటేస్తారా అనే ఆందోళనలు ఉన్నాయని ఆయన అంగీకరించారు. ఉద్ధవ్ ఠాక్రే కూడా ముస్లింలు బలమైన హిందూత్వ వైఖరికి పేరుగాంచిన సేనకు ఓటు వేయడంతో బహుశా మొదటిసారిగా లాభపడ్డారు. వ్యవసాయ సంక్షోభం, మరాఠా కోటా విషయంలో ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని ప్రభుత్వం పల్టీలు కొట్టడం, శివసేన, ఎన్సీపీ రెండింటిలో ఏర్పడిన చీలికలు, ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని ఎంవీఏ ప్రభుత్వాన్ని పడగొట్టడం, అలాగే కాంగ్రెస్, దాని మిత్ర పక్షాల ఎడతెగని ప్రచారం, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగాన్ని మార్చాలని బీజేపీ కోరుకోవడం వంటివి కాషాయ పార్టీని ఓడించడంలో కీలక పాత్ర పోషించాయి.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు వచ్చేశాయ్

న్యూదిల్లీ: దేశంలోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలైన ఐఐటీల్లో ఇంజినీరింగ్ సీట్ల భర్తీకి నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. గత నెల 26న జరిగిన ఈ పరీక్ష ప్రాథమిక కీని ఇటీవల విడుదల చేసిన ఐఐటీ మద్రాస్.. తాజాగా తుది కీ, జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలను ప్రకటించింది. దేశంలోని ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలతో పాటు కేంద్ర ప్రభుత్వ ఉన్నత విద్యాసంస్థల్లో సీట్లు భర్తీ చేసేందుకు నిర్వహించిన ఈ పరీక్షను దాదాపు 2 లక్షల మంది రాయగా... వీరిలో తెలుగు రాష్ట్రాల నుంచి 40 వేల మంది ఉన్నారు. బీటెక్, బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ (బీఎస్), ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో సీట్ల భర్తీకి జోసా పేరిట సంయుక్తంగా కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ కౌన్సెలింగ్ ప్రక్రియ జూన్ 10 నుంచి జులై 23 వరకు కొనసాగనుంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.